# శుభోదయం
ప్రతీ అక్షరం..ప్రజా సమరం......!

WWW.SUBHODAYAMDAILY.COM

అమరావతి,హైదరాబాద్, సంపుటి : 01, సంచిక : 309, పేజిలు : 08, ఎడిటర్ : వి. శ్రీనివాసరావు (6281773157) మంగళవారం - 21- జనవరి - 2025




## ప్రేమను తెంచుకునేందుకు.. ప్రియుడికి విషమిచ్చి చంపిన మహిళకు మరణశిక్ష

- కేరళలో శరణ్ రాజ్ అనే ప్రియుడిని చంపిన ప్రేయసి గ్రీష్మ
- తనతో రిలేషన్‌షిప్‌ను ముగించేందుకు ఒప్పుకోలేదని ఘాతుకం
- లవర్‌తో పెస్టిసైడ్ కలిపిన డ్రింక్ తాగించి చంపేసిన ప్రియురాలు



2లో

## కోర్టు తీర్పు పట్ల సంతృప్తి చెందలేదు.. సంజయ్‌కు జైలు శిక్షపై మమతా బెనర్జీ స్పందన

- మనమంతా మరణశిక్షను డిమాండ్ చేశాం
- కోర్టు మరణించే వరకు జీవిత ఖైదు విధించింది
- కోల్‌కతా పోలీసులు ఈ కేసు దర్యాప్తును కొనసాగించి ఉంటే నిందితుడికి మరణశిక్ష నిర్ధారించేవారు



2

## సుప్రీంకోర్టులో రాహుల్ గాంధీకి బిగ్ రిలీఫ్

అమిత్ షాపై చేసిన వ్యాఖ్యలపై పరువునష్టం కేసు

పరువునష్టం కేసు వేసిన బీజేపీ కార్యకర్త బాధిత వ్యక్తి మాత్రమే పరువునష్టం కేసు వేయగలరన్న రాహుల్ తరపు న్యాయవాది



## జగన్ మీకు దత్తపుత్రుడు... 'మోదానీ'కి దోచిపెట్టే ఏజెంట్

అమిత్ షాపై షర్మిల ఫైర్

వైసీపీ ఐదేళ్ల పాలన ఒక విపత్తు అన్న అమిత్ షా

రాష్ట్రంలో విధ్వంసం జరుగుతుంటే ఢిల్లీలో కూర్చొని వేడుక చూశారా? అన్న షర్మిల

దమ్ముంటే వైసీపీ పాలనపై కేంద్ర సంస్థలతో దర్యాప్తు జరిపించాలని సవాల్

అమరావతి: కేంద్ర హోం మంత్రి అమిత్ షాపై ఏపీ కాంగ్రెస్ చీఫ్ షర్మిల తీవ్ర విమర్శలు గుప్పించారు. అమిత్ షా వ్యాఖ్యలు చూస్తే ఊసరవెల్లి కూడా సిగ్గుపడుతుందని అన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలన ఒక విపత్తు అని అమిత్ షా అన్నారని... ఐదేళ్ల పాటు విధ్వంసం జరుగుతుంటే ఢిల్లీలో కూర్చొని వేడుక చూశారా? అని ప్రశ్నించారు. "ఆ ఐదేళ్లు కేంద్రంలో ఉన్నది మీరే కదా? రివర్స్ టెండరింగ్ పేరుతో పోలవరం పనులను


# పంచాయతీరాజ్‌పై పవన్ సమీక్ష.. కీలక నిర్ణయం

- గ్రామీణ ప్రజలకు నిరంతరాయంగా పంచాయతీ సేవలు అందేలా చూడాలి


గ్రామ పంచాయతీ క్లస్టర్ వ్యవస్థకు కొత్త రూపు..

- ఆదాయ ప్రాతిపదికతతోపాటు జనాభా ప్రాతిపదికనను జోడించి కొత్త గ్రేడ్లు ఇవ్వనున్నారు..
- గ్రేడ్లు ఆధారంగా సిబ్బంది కేటాయింపు ఉంటుంది





అమరావతి: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. ఈ రోజు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖపై సమీక్ష సమావేశం నిర్వహించారు.. ఈ సమావేశంలో కీలక ఆదేశాలు జారీ చేశారు..గ్రామ పంచాయతీ క్లస్టర్ వ్యవస్థకు కొత్త రూపు.. ఆదాయ ప్రాతిపదికతతోపాటు జనాభా ప్రాతిపదికనను జోడించి కొత్త గ్రేడ్లు ఇవ్వనున్నారు.. గ్రేడ్లు ఆధారంగా సిబ్బంది కేటాయింపు ఉంటుందని.. గ్రామ పంచాయతీ, సచివాలయ సిబ్బందితో సమన్వయం చేసుకోవాలని.. అధ్యయనం చేసి సిఫార్సులు చేసేందుకు ఓ కమిటీని కూడా ఏర్పాటు చేస్తున్నట్టు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వెల్లడించారు. గ్రామీణ ప్రజలకు నిరంతరాయంగా పంచాయతీ సేవలు అందేలా చూడాలని, దీనికోసం సిబ్బంది లేమి సమస్యను అధిగమించాలని స్పష్టం చేశారు పవన్ కల్యాణ్.. పంచాయతీరాజ్ శాఖ పరిధిలోని గ్రామ పంచాయతీల క్లస్టర్ విధానంలో మార్పులు చేపట్టి, కొత్త మార్గదర్శకాలను రూపొందించాలని ఆదేశించారు. గతంలో పంచాయతీల ఆదాయాన్ని ప్రాతిపదికగా తీసుకొని మాత్రమే చేపట్టిన మిగతా..2లో



2

## మార్స్ పై రాత్రి ఎలా ఉంటుంది?...

నాసా రోవర్ తీసిన వీడియో!

పౌర్ణమి వంటి సమయంలో వెన్నెల వెలుగులు ఉంటే... అమావాస్యకు చిమ్మ చీకటి అలుముకుంటుంది

మరి అంగారక గ్రహంపై రాత్రి ఎలా ఉంటుందనే వీడియోను నాసా విడుదల చేసింది

## శుభోదయం దినపత్రిక క్యాలెండర్ ఆవిష్కరించిన సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ



కందుకూరు, అర్బీ ఇంచార్జ్ - శ్రీకాంత్ (శుభోదయం న్యూస్): నెల్లూరు జిల్లా కందుకూరు నియోజకవర్గం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో శుభోదయం దినపత్రిక నూతన సంవత్సరం సందర్భంగా ప్రచురించిన క్యాలెండర్ను సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ శ్రీ పూజ మాట్లాడుతూ శుభోదయం దినపత్రిక ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నిరంతరం ప్రజా చైతన్యం కోసం వార్తలు అందిస్తుందని, ఇదేవిధంగా భవిష్యత్తులో ప్రజల కోసం వార్తల



అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శుభోదయం పత్రిక కందుకూరు అర్బీ ఇంచార్జ్ శ్రీకాంత్, మీడియా ప్రతినిధులు జి రాము, ఎర్రంశెట్టి ఆనందమోహన్, వై నాగభూషణం, చక్క వెంకట కేశవరావు, కృష్ణ, బీసా వంశీ తదితరులు పాల్గొన్నారు.

## శుభోదయం - విఎస్ 9 న్యూస్ క్యాలెండర్ ఆవిష్కరణ



ఉయ్యూరు, (శుభోదయం న్యూస్) : రవాణా శాఖ ఉయ్యూరు యూనిట్ కార్యాలయం మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ సుబ్బారావు చేతుల మీద శుభోదయం న్యూస్, వి ఎస్ 9 క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తాళ్లపాలెం



ఎక్స్ సర్పంచ్ వాలిశెట్టి రవిశంకర్, యాదల కుమారస్వామి ఎస్కార్ట్స్ ట్రాక్టర్ డీలర్, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ టీ.వీ. న్ సుబ్బారావు. సీనియర్ గుమస్తా జోసెఫ్ హోం గార్డు తదితరులు పాల్గొన్నారు.



వివరాలు 2లో..

## దావోస్ లో కలుసుకున్న తెలుగు రాష్ట్రాల సీఎంలు..

వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సుకు హాజరైన ముఖ్యమంత్రులు

మంత్రులతో కలిసి స్విట్జర్లాండ్ పర్యటన

జ్యూరిచ్ ఎయిర్ పోర్ట్ లో కలిసిన రెండు రాష్ట్రాల సీఎంలు, మంత్రులు

తెలంగాణ మంత్రి శ్రీధర్ బాబు భుజంపై ఏపీ సీఎం చంద్రబాబు చేతులేసి, షేక్ హ్యాండ్ ఇస్తూ దిగిన ఫొటో ప్రస్తుతం వైరల్



2

## గవర్నర్ ప్రతిభా పురస్కారాలు-2024.. ప్రకటించిన రాజ్ భవన్

- అవార్డులకు ఎంపికైన 8 మంది జాబితాను వెల్లడి
- వివిద రంగాలలో సేవలు అందించిన వ్యక్తులు, సంస్థలకు ఈ అవార్డులను ప్రదానం
- ఈనెల 26న తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఈ అవార్డులను అందించనున్నారు
- గణతంత్ర దినోత్సవం సందర్భంగా నాలుగు రంగాలకు చెందిన వారికి ఏటా పురస్కారాలు

# ఢిల్లీలో ప్రచారం కోసం రేవంత్‌ను కాంగ్రెస్ స్టార్ క్యాంపెయినర్‌గా ఎంపిక

## వచ్చే నెలలో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు

### రేవంత్ రెడ్డికి కీలక బాధ్యతలు.. రాహుల్ ఆలోచన అదేనా..!

మొత్తం 40 మందితో జాబితా విడుదల

గ్యారంటీల ప్రచార బాధ్యతలను రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ నాయకత్వం అప్పగించింది



వివరాలు 2లో..

హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కీలక బాధ్యతలను అప్పగించేందుకు కాంగ్రెస్ అగ్ర నాయకత్వం యోచిస్తోంది. ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డి దావోస్ పర్యటనకు వెళ్లారు. అక్కడి నుంచి రాగానే ఢిల్లీ ఎన్నికల ప్రచారంలోకి ఆయన దిగనున్నారు. ఈ క్రమంలోనే సీఎం రేవంత్ రెడ్డికి పార్టీ అగ్రనాయకత్వం కీలక బాధితులు అప్పగించేందుకు సిద్ధమవుతోంది. వచ్చే నెలలో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగబోతున్నాయి. ఈ క్రమంలో ఢిల్లీలో ప్రచారం కోసం రేవంత్‌ను కాంగ్రెస్ స్టార్ క్యాంపెయినర్‌గా ఎంపిక చేసింది. మొత్తం 40 మందితో జాబితా విడుదల చేసింది. తాజాగా ఢిల్లీ ఎన్నికలకు సంబంధించిన రెండు కీలక హామీలను రేవంత్ పీసీసీ చీఫ్‌తో కలిసి ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అమలు బాధ్యత తీసుకుంటానని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. దీంతో గ్యారంటీల ప్రచార బాధ్యతలను రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ నాయకత్వం అప్పగించింది. ఢిల్లీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కాంగ్రెస్ పార్టీ..

# మార్స్ పై రాత్రి ఎలా ఉంటుంది?...

చీకటి పడిందంటే.. ఆకాశంలో చందమామ, నక్షత్రాలు కనువిందు చేస్తాయి. పౌర్ణమి వంటి సమయంలో అయితే వెన్నెలతో కాస్త వెలుగు ఉంటే... అమావాస్య సమయంలో చీకటి దట్టంగా అలుముకుంటుంది. మరి మన సౌర కుటుంబంలో జీవం ఉనికి ఉండే అవకాశమున్న మార్స్ (అంగారకుడి)పై రాత్రి ఎలా ఉంటుందో తెలుసా? దీనికి సంబంధించి మార్స్ పై తిరుగాడుతున్న నాసా రోవర్ 'క్యూరియాసిటీ' అద్భుతమైన వీడియోలను చిత్రీకరించింది. వాటిని నాసా ఎక్స్ (ట్విట్టర్)లో 'క్యూరియాసిటీ' పేరిట ఉన్న ఖాతాలో పోస్టు చేసింది.

వాతావరణం లేకపోవడంతో...

భూమిపై మనం వాడే విద్యుద్దీపాల వెలుగు కారణంగా ఆకాశం సరిగా కనిపించదు. అందుకే నగరాలకు దూరంగా కొండలు, గుట్టల ప్రాంతాలకు వెళ్లి ఆకాశాన్ని పరిశీలిస్తూ ఉంటారు. అంగారకుడిపై ఈ సమస్య లేదు. పైగా భూమితో పోలిస్తే అంగారకుడిపై వాతావరణం చాలా పలుచగా ఉంటుంది. అందువల్ల అంతరిక్షం నుంచి వచ్చే వెలుగు నేరుగా ప్రసరిస్తూ ఉంటుంది. దీనితో అంగారకుడిపై రాత్రిపూట కూడా కొంత మేర వెలుతురు కనిపిస్తుంది. నక్షత్రాలు అయితే మరింత స్పష్టంగా అత్యంత ఎక్కువ సంఖ్యలో కనిపిస్తాయి.

# సుప్రీంకోర్టులో రాహుల్ గాంధీకి బిగ్ రిలీఫ్

ఢిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. లోక్ సభ ఎన్నికలకు ముందు కేంద్ర హెూం మంత్రి అమిత్ షాపై చేసిన వ్యాఖ్యలకు సంబంధించి రాహుల్ పై పరువునష్టం కేసు నమోదయింది. ఈ కేసులో రాహుల్ పై క్రిమినల్ విచారణను నిలిపివేస్తున్నట్టు సుప్రీంకోర్టు తెలిపింది. రాహుల్ పై బీజేపీ కార్యకర్త నవీన్ ఝా వేసిన పరువునష్టం కేసును కొట్టివేసింది. రాహుల్ గాంధీ దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్ ను జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం ఈరోజు విచారించింది. రాహుల్ తరపున సీనియర్ న్యాయవాది, కాంగ్రెస్ నేత అభిషేక్ మను సింఘ్వి వాదనలు వినిపించారు. బాధిత వ్యక్తి మాత్రమే పరువునష్టం కేసు వేయగలరని... ప్రాక్సీ పార్టీ ద్వారా ఫిర్యాదు చేయలేమని చెప్పారు. ఇదే విషయాన్ని న్యాయస్థానాలు అనేక తీర్పుల ద్వారా వెల్లడించాయని తెలిపారు.

## గవర్నర్ ప్రతిభా పురస్కారాలు-2024..
# ప్రకటించిన రాజ్ భవన్

హైదరాబాద్: గవర్నర్ ప్రతిభా పురస్కారాలు-2024 అవార్డులను తెలంగాణ గవర్నర్ కార్యాలయం ప్రకటించింది. ఈ అవార్డులకు ఎంపికైన 8 మంది జాబితాను వెల్లడించింది. వివిధ రంగాలలో సేవలు అందించిన వ్యక్తులు, సంస్థలకు ఈ అవార్డులను ప్రదానం చేస్తారు. ఈనెల 26న తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఈ అవార్డులను అందించనున్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా నాలుగు రంగాలకు చెందిన వారికి ఏటా పురస్కారాలు ఇవ్వాలని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ నిర్ణయించారు. పర్యావరణ పరిరక్షణ, దివ్యాంగుల సంక్షేమం, క్రీడలు, సాంస్కృతిక విభాగాలలో గత ఐదేళ్లుగా ఉత్తమ సేవలు అందిస్తున్న వారికి గవర్నర్ ప్రతిబా పురస్కారాలు ఇవ్వనున్నట్టు గవర్నర్ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం తెలిపారు. సంస్థలు, వ్యక్తులకు వేర్వేరు కేటగిరీలలో ఈ అవార్డులు ఉంటాయన్నారు. అవార్డు కింద రూ.2లక్షలు, జ్ఞాపిక అందజేయనున్నారు. ఈ అవార్డుకు ఎంపికైన వారిని పరిశీలించినట్టయితే.. దుశర్ల సత్యనారాయణ, అరికపూడి రఘు, పారా ఒలంపిక్ విజేత జీవాంజి దీప్తి, ప్రొఫెసర్ పాండు రంగరావు, పి.బి.కృష్ణా భారతి సంయుక్తంగా, ధృవాంశ్ ఆర్గనైజేషన్, ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి, ఆదిత్య మెహతా ఫౌండేషన్, సంస్కృతి ఫౌండేషన్ లు ఎంపికయ్యారు.

## కోర్టు తీర్పు పట్ల సంతృప్తి చెందలేదు..
# సంజయ్‌కు జైలు శిక్షపై మమతా బెనర్జీ స్పందన

కోల్‌కతా: దేశవ్యాప్తంగా సంచలనం రేపిన కోల్‌కతాలోని ఆర్జీ కర్ హత్యాచారం కేసులో దోషి సంజయ్ రాయ్‌కు సీబీఐ కోర్టు జీవిత ఖైదు విధించింది. సీఎం మమతా బెనర్జీ దీనిపై స్పందించారు. సంజయ్ రాయ్‌కు కోర్టు విధించిన శిక్ష పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. సోమవారం మీడియాతో ఆమె మాట్లాడారు. 'నేను సంతృప్తి చెందలేదు. మనమంతా మరణశిక్షను డిమాండ్ చేశాం. కానీ కోర్టు మరణించే వరకు జీవిత ఖైదు విధించింది' అని అన్నారు. కాగా, గత ఏడాది ఆగస్ట్ 9న ఆర్జీ కర్ ఆసుపత్రిలో రాత్రి విధుల్లో ఉన్న జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచారం కేసు దర్యాప్తును కోల్‌కతా పోలీసుల నుంచి బలవంతంగా తీసుకున్నారని మమతా బెనర్జీ ఆరోపించారు. ఒకవేళ కోల్‌కతా పోలీసులు ఈ కేసు దర్యాప్తును కొనసాగించి ఉంటే నిందితుడికి మరణశిక్ష నిర్ధారించేవారని అన్నారు. మరోవైపు సీబీఐ దర్యాప్తును మమతా బెనర్జీ ప్రశ్నించారు. 'వారు (సీబీఐ) దర్యాప్తు ఎలా నిర్వహించారో మాకు తెలియదు. రాష్ట్ర పోలీసులు దర్యాప్తు చేసిన ఇలాంటి అనేక కేసుల్లో మరణశిక్ష విధించారు. ఈ శిక్ష పట్ల నేను సంతృప్తి చెందలేదు. మరణశిక్షను డిమాండ్ చేస్తున్నాం. మాకు న్యాయం కావాలి' అని అన్నారు.

## దావోస్ లో కలుసుకున్న
# తెలుగు రాష్ట్రాల సీఎంలు..

హైదరాబాద్/అమరావతి: తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల అరుదైన కలయికకు సంబంధించిన ఫొటో ఒకటి ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. విదేశీ పెట్టుబడుల కోసం తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి విదేశాల్లో పర్యటిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులో పాల్గొనేందుకు మంత్రి శ్రీధర్ బాబు, అధికారుల బృందంతో సీఎం రేవంత్ రెడ్డి దావోస్ కు వెళ్లారు. ఇదే సదస్సులో పాల్గొనేందుకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, మంత్రి నారా లోకేశ్ తో కలిసి దావోస్ కు వెళ్లారు. విమానాశ్రయంలో సీఎం చంద్రబాబు, మంత్రులకు యూరప్ టీడీపీ ఫోరం సభ్యులు, ప్రవాసాంధ్రులు ఘన స్వాగతం పలికారు. ఈ క్రమంలో విమానాశ్రయంలోనే ఉన్న తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని చంద్రబాబు కలుసుకున్నారు. ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు మర్యాదపూర్వకంగా పలకరించుకున్నారు. మంత్రుల బృందంతో కలిసి ఎయిర్ పోర్ట్ లో ఫొటోలు దిగారు. తెలంగాణ మంత్రి శ్రీధర్ బాబు భుజంపై ఏపీ సీఎం చంద్రబాబు చేతులేసి, షేక్ హ్యాండ్ ఇస్తూ దిగిన ఫొటో ప్రస్తుతం వైరల్ గా మారింది. అనంతరం రెండు రాష్ట్రాల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, వివిధ పెట్టుబడులపై ఇరువురు సీఎంలు చర్చించుకున్నారు.

## తెలంగాణలో మద్యం ప్రియులకు షాక్..
# తగ్గుతున్న బీర్ల నిల్వలు

హైదరాబాద్: తెలంగాణలో బీర్ల నిల్వలు తగ్గిపోతున్నాయి. ప్రస్తుతం గోడౌన్‌లో లక్ష కేసులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఈ నెల 8 వరకు సుమారు 84 లక్షల కేసులు ఉండగా క్రమేపి బీర్ల స్టాక్ తగ్గుతోంది. మరో రెండు, మూడు రోజులు మేనేజ్ చేయొచ్చని డిస్ట్రిబ్యూటర్లు అంటున్నారు. పాత బకాయిలు ఇవ్వకపోవడంతో బీర్ల స్టాక్‌ను యునైటెడ్ బ్రూవరీస్ (యూబీ) సంస్థ నిలిపివేసిన సంగతి తెలిసిందే. తెలంగాణలో కొత్త బీర్ బ్రాండ్లు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. రిజిస్టర్ కానీ కంపెనీలను తీసుకొస్తే ఇబ్బందులు తప్పవని డిస్ట్రిబ్యూటర్లు అభిప్రాయపడుతున్నారు. గోడౌన్‌లో ఉన్న స్టాక్‌ను విడుదల వారీగా ప్రభుత్వం విడుదల చేస్తోంది. తాము తయారు చేసే బీర్లను ఇక నుంచి తెలంగాణలో సరఫరా చేయబోమని యూబీ సంస్థ ప్రకటించింది. బేసిక్ ధరలు పెంచలేదని, బిల్లులు పెండింగ్‌లో ఉన్నందున బీర్ల సరఫరా నిలిపివేస్తున్నట్టు కంపెనీ నిబంధనల ప్రకారం...ఎన్ఎస్ఈ, బీఎస్ఈ (బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్)లకు సమాచారం ఇచ్చింది. రాష్ట్రంలో నాలుగైదు బ్రాండ్ల బీర్లకు మంచి మార్కెట్ ఉంది. అందులో యూబీ తయారు చేసే కింగ్‌ఫిషర్ బీర్లదే సింహభాగం. మొత్తం తెలంగాణ మార్కెట్‌లో 72 శాతం వరకు ఈ బ్రాండ్‌దే ఉంటుందని అంచనా. ఈ బీర్లు తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీజీబీసీఎల్)కు సరఫరా చేసినందుకుగాను కేస్‌కు రూ.289 చొప్పున తయారీదారులకు చెల్లిస్తారు. ఈ బేసిక్ ధర పెంచాలన్న డిమాండ్ ఎక్సైజ్ శాఖలో చాలా కాలంగా వినిపిస్తున్నా, అమల్లోకి రాకపోవడంతో తాజా సమస్య ఏర్పడింది. 2019-20 నుంచి కంపెనీకి చెల్లించే బేసిక్ ధరలను తెలంగాణ ప్రభుత్వం సవరించలేదని, దీని కారణంగా భారీ నష్టాలు వస్తున్నాయని ఆ లేఖలో వెల్లడించారు. టీజీబీసీఎల్ చెల్లించాల్సిన పెద్ద మొత్తం పెండింగ్‌లో ఉందని, ఈ కారణంగానే తాము బీర్లు సరఫరా చేయడం లేదని స్పష్టం చేసింది.

# ప్రేమను తెంచుకునేందుకు.. ప్రియుడికి విషమిచ్చి చంపిన మహిళకు మరణశిక్ష



తిరువనంతపురం: కేరళలో బాయ్‌ఫ్రెండ్‌ను చంపిన గ్రీష్మ అనే యువతికి స్థానిక నెయ్యాట్టింకర కోర్టు మరణశిక్ష విధిస్తూ తీర్పును వెల్లడించింది. ఆమెకు సహకరించిన మామకు మూడు సంవత్సరాల జైలు శిక్ష విధించింది. తనతో రిలేషన్‌షిప్‌ను ముగించేందుకు శరణ్ రాజ్ (23) ఒప్పుకోలేదని పెస్టిసైడ్ కలిపిన డ్రింక్ తాగించి గ్రీష్మ అతడిని చంపేసింది. 2022లో ఈ ఘటన జరగగా... అప్పుడు ఆమె వయసు 22 ఏళ్లు. ఆమె వయసు దృష్ట్యా శిక్ష తగ్గించాలన్న లాయర్ వాదనను న్యాయస్థానం తోసి పుచ్చింది. క్రూర నేరానికి పాల్పడి, సాక్ష్యాలను చెరిపేసి, దర్యాప్తును తప్పుదోవ పట్టించిందని, ఆమె వయసును పరిగణనలోకి తీసుకోలేమని జడ్జి చెప్పారు. ఇక ప్రాసిక్యూషన్ నేరాన్ని రుజువు చేయడానికి సందర్భోచిత, డిజిటల్, శాస్త్రీయ ఆధారాలపై ఆధారపడిందని కోర్టు పేర్కొంది. కాగా, ఇది అరుదైన కేసు అని, నిందితులకు ఉరిశిక్ష విధించాలని వాదించినట్లు బాధితుడి తరఫు న్యాయవాది వీఎస్ వినీత్ కుమార్ మీడియాతో అన్నారు. ఇది ఒక ఆదర్శప్రాయమైన తీర్పుగా ఆయన పేర్కొన్నారు. 2022లో గ్రీష్మ తన ప్రియుడు శరణ్ రాజ్‌కు పారాక్వాట్ అనే పెస్టిసైడ్ కలిపిన ఆయుర్వేద టానిక్‌తో విషమిచ్చింది. దాంతో అతని శరీరంలోని పలు అవయవాలు ఫెయిల్ కావడంతో 11 రోజుల తరువాత అతడు చనిపోయాడు. తమిళనాడుకు చెందిన ఆర్మీలో పనిచేసే ఓ వ్యక్తితో ఆమె పెళ్లి ఖాయం కావడంతో రాజ్‌తో తన రిలేషన్‌షిప్‌ను ముగించాలనుకుంది. కానీ, తమ సంబంధాన్ని ముగించేందుకు అతడు నిరాకరించడంతో గ్రీష్మ హత్యకు పథకం వేసింది. హత్యతో సహా భారతీయ న్యాయ సంహితలోని వివిధ సెక్షన్ల కింద గ్రీష్మ దోషిగా తేలింది. ఆమె మామ నిర్మలకుమారన్ నాయర్ సాక్ష్యాలను ధ్వంసం చేసిన కేసులో దోషిగా తేలాడు. అయితే, కస్టడీలోకి తీసుకున్న అతని తల్లి సాక్ష్యాధారాలు లేకపోవడంతో నిర్దోషిగా విడుదలైంది.

# శాసనసభల తక్కువ సమావేశాలు ఆందోళనకరం

ఢిల్లీ: శాసనసభల సమావేశాల సంఖ్య తగ్గుతుండడం పట్ల లోక్‌సభ స్పీకర్ ఓమ్ బిర్లా సోమవారం ఆందోళన వ్యక్తం చేశారు. ఆ సమస్య పరిష్కారానికి కృషి చేయవలసిందిగా సభాపతులకు ఆయన విజ్ఞప్తి చేశారు.



85వ అఖిల భారత సభాపతుల సమ్మేళనం (ఎఐపిఒసి) ప్రారంభ సమావేశంలో బిర్లా ఆ వ్యాఖ్యలు చేశారు.

ఢిల్లీ శాసనసభ తన పూర్తి ఐదు సంవత్సరాల హయాంలో కేవలం 74 సమావేశాలు నిర్వహించిందనే వార్తల మధ్య ఆయన ఆ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. పార్లమెంట్, రాష్ట్ర శాసనసభల్లో అంతరాయాల యోచన పట్ల కూడా లోక్‌సభ స్పీకర్ ఆందోళన వ్యక్తం చేశారు. సభ గౌరవాన్ని పరిరక్షించేందుకు మార్గదర్శక సూత్రాలు రూపొందించవలసిందిగా రాజకీయ పార్టీలకు ఆయన విజ్ఞప్తి చేశారు. 'స్టాండింగ్ కమిటీలు మినీ పార్లమెంట్‌లు. వాటి పని తీరును పటిష్ఠం చేయవలసిన ఆవశ్యకత ఉంది' అని ఓమ్ బిర్లా సూచించారు. 85వ ఎఐపిఒసికి రాజ్యసభ ఉపాధ్యక్షుడు హరివంశ్, బీహార్ అసెంబ్లీ స్పీకర్ నంద్ కిశోర్ యాదవ్, బీహార్ ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి, దేశం అంతటి నుంచి రాష్ట్ర శాసనసభల అధిపతులు హాజరయ్యారు. బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ సోమవారం ఉదయం ఓమ్ బిర్లాతో భేటీ అయ్యారు. కానీ '75వ రాజ్యాంగ వార్షికోత్సవం: రాజ్యాంగ విలువల పటిష్ఠతలో పార్లమెంట్, రాష్ట్ర శాసనసభల కృషి' అంశంపై రెండు రోజుల సమ్మేళనానికి ఆయన విచిత్రంగా గైర్‌హాజరయ్యారు. పిఆర్ఎస్ లెజిస్లేటివ్ అధ్యయనం ప్రకారం, కాలపరిమితి ముగుస్తున్న ఢిల్లీ శాసనసభ తన ఐదు సంవత్సరాల హయాంలో 74 సమావేశాలు నిర్వహించింది. అంటే సగటున ఏడాదికి 15 రోజుల సమావేశం అయిందన్నమాట. సభ సమావేశమైన రోజుల్లో అది సగటున మూడు గంటలు భేటీ అయింది. సభ తన హయాంలో కేవలం 14 బిల్లులు ఆమోదించింది. పూర్తి కాలం పనిచేసిన గత ఏ అసెంబ్లీకైనా అది అత్యల్ప సంఖ్య.

# పంచాయతీరాజ్‌పై పవన్ సమీక్ష.. కీలక నిర్ణయం

మొదటి పేజి తరువాయి



గతంలో పంచాయతీల ఆదాయాన్ని ప్రాతిపదికగా తీసుకొని మాత్రమే చేపట్టిన క్లస్టర్ గ్రేడ్ల విభజన విధానానికి, నూతనంగా జనాభాను కూడా ప్రాతిపదికగా తీసుకొని పంచాయతీల క్లస్టర్ గ్రేడ్లు విభజించాలని సూచించారు. సిబ్బంది నియామకం విషయంలో హెచ్చుతగ్గులు లేకుండా, గ్రామ పంచాయతీల్లో సేవలు నిరంతరాయంగా ప్రజలకు అందాలన్నారు. పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులతో.. తన క్యాంపు కార్యాలయంలో గ్రామ పంచాయతీల క్లస్టర్ గ్రేడ్ల విభజనపై సమీక్ష నిర్వహించారు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఈ సమావేశంలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్, కమిషనర్ కృష్ణ తేజ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అయితే, ఆదాయం ఎక్కువగా ఉన్న పంచాయతీల్లో జనాభా తక్కువగా ఉండి, ఆదాయం తక్కువగా ఉన్న పంచాయతీల్లో జనాభాగా ఎక్కువగా ఉండే పరిస్థితుల్లో పాత క్లస్టర్ వ్యవస్థ వల్ల సిబ్బంది నియామకం విషయంలో తలెత్తుతున్న ఇబ్బందులు ఈ సమీక్షలో ప్రస్తావనకు వచ్చాయి. గ్రామ పంచాయతీ, సచివాలయ సిబ్బందిని సమన్వయం చేసుకొని కొత్త క్లస్టర్ గ్రేడ్ల విభజన విధానంలో సిబ్బందిని నియమించుకోవడంపై చర్చించారు.. ఈ విధంగా చేయడం వల్ల మౌలిక వసతుల కల్పన, సంక్షేమ పథకాలు అమలు, ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణతో పాటు గ్రామ పంచాయతీల ప్రాథమిక బాధ్యత అయిన తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ, అంతర్గత రోడ్ల నిర్మాణం, పారిశుద్ధ్య మెరుగుదలకు తగినంత మంది సిబ్బంది ఉంటారని, వీటిపై అధ్యయనం చేసి పంచాయతీల్లో పరిపాలన సులభతరం చేసేందుకు అవసరమైన సిఫార్సులు చేసేందుకు కమిటీ వేయాలని ఉపముఖ్యమంత్రివర్యులు నిర్ణయించారు. కొత్త క్లస్టర్ల విభజన, గ్రేడ్ల కేటాయింపుపై ప్రభుత్వానికి ఈ కమిటీ సిఫార్సులు చేయనుంది. పంచాయతీరాజ్ శాఖ నుంచి నలుగురు ఉన్నతాధికారుల కమిటీ ఏర్పాటవుతుంది.. జిల్లా యూనిట్ ప్రాతిపదికన 26 జిల్లాల్లో ఉన్న పంచాయతీల ఆదాయం, జనాభాను ప్రాతిపదికగా తీసుకొని జిల్లా కలెక్టర్లు ఇచ్చే నివేదికలను రాష్ట్ర కమిటీ పరిశీలించిన తర్వాత పంచాయతీల క్లస్టర్ గ్రేడ్లను ప్రభుత్వానికి నివేదించనున్నారు.

# ఢిల్లీలో ప్రచారం కోసం రేవంత్‌ను కాంగ్రెస్ స్టార్ క్యాంపెయినర్‌గా ఎంపిక

మొదటి పేజి తరువాయి

ఢిల్లీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కాంగ్రెస్ పార్టీ.. కీలకమైన హామీలను ఇవ్వడం ద్వారా అధికారంలోకి రావచ్చని భావిస్తోంది. అధికారంలో ఉన్న ఆప్‌పై ఉన్న ప్రజా వ్యతిరేకతను క్యాష్ చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. ఈ క్రమంలోనే కాంగ్రెస్ పార్టీ ఐదు కీలక హామీలను ఇస్తోంది. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా.. అధికారంలోకి వస్తే 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తామని, రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తామని, పార్టీ అధికారంలోకి వస్తే వీటిని అమలు చేసే బాధ్యత తనదేనని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణలో ఇచ్చిన ప్రతి హామీ అమలు చేస్తున్నామని రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఢిల్లీలో తెలుగు రాష్ట్రాలకు చెందిన ఓటర్లు పెద్ద సంఖ్యలో ఉన్నారు. వీరిని ఆకట్టుకునే ప్రయత్నంలో భాగంగా ఏపీ తెలంగాణకు చెందిన పార్టీ నేతలు కాంగ్రెస్ పార్టీ ప్రచారానికి నియమిస్తోంది. తాజాగా స్టార్ క్యాంపెయినర్ల జాబితాలో సోనియా, రాహుల్ గాంధీ, ఖర్గే, ప్రియాంకతో సహా మొత్తం 40 మంది వరకు ఉన్నారు. మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలోనూ రేవంత్‌కు స్టార్ క్యాంపైనర్‌గా కాంగ్రెస్ బాధ్యతలు అప్పగించింది. ఇప్పుడు ఢిల్లీ ఎన్నికలను కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా భావించడంతో గ్యారంటీల గురించి ప్రచారం చేయడంతో పాటు పార్టీ అభ్యర్థులు గెలుపు కోసం పనిచేయాలని రాహుల్ గాంధీ రేవంత్ రెడ్డికి సూచించారు ఇప్పుడు ఢిల్లీ వేదికగా రేవంత్ పార్టీ కోసం ప్రచారం చేయనున్నారు.

## కటింగ్‌లు, కటాఫ్‌లు మినహా.. ఏడాది కాంగ్రెస్ పాలనలో తెలంగాణ సమాజానికి ఒరిగిందేమిటి..? : కేటీఆర్



హైదరాబాద్ : కాంగ్రెస్ ఏడాది పాలనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను నట్టేట ముంచారని కేటీఆర్ మండిపడ్డారు. సంక్షేమ పథకాలకు కోతలు, కటాఫ్‌లు పెడుతూ.. అభివృద్ధిని గాలికి వదిలేశారని కేటీఆర్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రుణమాఫీ, రైతు భరోసా, సాగునీళ్లు, కరెంట్, కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్, తులం బంగారం, మహాలక్ష్మి రూ. 2500, ఆసరా పెన్షన్లు, రూ. 5 లక్షల విద్యా భరోసా కార్డు, జాబ్ క్యాలెండర్, ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలు, విద్యార్థినులకు స్కూటీలు, తెలంగాణ అమరవీరుల కుటుంబాలకు రూ. 25 వేల పెన్షన్, ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, రైతులకు రూ. 3 లక్షల వడ్డీ లేని రుణం, భూమి లేని రైతులకు సైతం రైతు బీమా, నిరుద్యోగుల కోసం యూత్ కమిషన్.. రూ. 10 లక్షలు వడ్డీ లేని రుణం, నిరుద్యోగ యువతకు నెలకు రూ. 4 వేల నిరుద్యోగ భృతి, ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు రూ. 12 లక్షల ఆర్థిక సాయం, ఆశా కార్యకర్తలకు రూ.18 వేల వేతనం, మధ్యాహ్న భోజన కార్మికుల వేతనం రూ. 10 వేలకు పెంపు, 50 ఏళ్లు పైబడిన జానపద కళాకారులకు రూ. 3 వేల పెన్షన్, రేషన్ డీలర్లకు రూ. 5 వేల గౌరవ వేతనం, కమిషన్, ఆర్టీసీ విలీన ప్రక్రియ, ప్రతి ఆటో డ్రైవర్‌కు ఏడాదికి రూ.12 వేలు, విద్యార్థులకు ఫ్రీ ఇంటర్‌నెట్, కౌలు రైతులకు ఎకరాకు ఏడాదికి రూ.15 వేలకు రేవంత్ రెడ్డి సర్కార్ కటింగ్ పెట్టిందని కేటీఆర్ తెలిపారు. 200 యూనిట్లు ఉచిత కరెంట్ కటాఫ్, రూ.500 గ్యాస్ సిలిండర్, రైతుకూలీలకు ఏడాదికి రూ.12 వేలు, ఆఖరుకు ఇందిరమ్మ ఇళ్లకు కటాఫ్, పేదలకు ఇచ్చే ఇందిరమ్మ ఇండ్లకు కటాఫ్ ఎందుకు..? అర్హులైన ప్రతి పేదవాడికి సొంత ఇళ్లు కట్టించి ఎందుకు ఇవ్వరు..? డబుల్ బెడ్రూంలకు మూడు రంగులు వేసి మురిపిస్తున్న కాంగ్రెస్ సర్కార్ అని కేటీఆర్ విమర్శించారు. జాగో తెలంగాణ జాగో అని కేటీఆర్ నినదించారు.

# బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల మధ్య మాటల యుద్ధం




తెలంగాణభవన్: తెలంగాణలో బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. మంత్రి కోమటిరెడ్డి , మాజీ మంత్రి జగదీష్ రెడ్డి ఒకరిపై ఒకరు తీవ్ర విమర్శలు చేసుకున్నారు. మంత్రి కోమటిరెడ్డి వ్యాఖ్యలకు తాజాగా జగదీష్ రెడ్డి కౌంటిరచ్చారు. కోమటిరెడ్డిని చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు. కేటీఆర్‌ను చూస్తేనే ముఖ్యమంత్రి, మంత్రులు భయపడిపోతున్నారంటూ కామెంట్స్ చేశారు. మాజీ మంత్రి జగదీష్ రెడ్డి తెలంగాణభవన్ లో మీడియాతో మాట్లాడుతూ..'తెలంగాణలో రైతులను చూసి కాంగ్రెస్ పార్టీ భయపడుతోంది. కేటీఆర్‌ను చూసి సీఎం, మంత్రులు భయపడుతున్నారు. పోలీసుల సూచన మేరకు 12వ తేదీన జరగాల్సిన నల్గొండ రైతు దీక్షను వాయిదావేశాం. ఎక్కడి నుండి ఒత్తిడి వచ్చిందో పోలీసులు పర్మిషన్ రిజెక్ట్ చేశారు. కోమటిరెడ్డి వలనే పోలీసులు అనుమతి రద్దు చేశారు. నల్గొండ సభకు పర్మిషన్ ఇవ్వాలని హైకోర్టుకు వెళ్ళాము. హైకోర్టు సూచనతో ముందుకు వెళ్తాం. కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చెత్త మాటలు మాట్లాడుతున్నారు. పోలీసులు లేకుండా, సెక్యూరిటీ లేకుండా కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి నల్గొండ జిల్లాలో ఎక్కడికైనా వెళ్లి రాగలరా?. ఎప్పుడు దొరుకుతారా అని ప్రజలు ఎదురుచూస్తున్నారు. రైతుల ధాన్యం కొనే వరకు మేము కల్లాల్లోనే ఉన్నాం. మిల్లర్లతో కుమ్మక్కు అయ్యి రైతులను దళారులకు కాంగ్రెస్ నేతలు అప్పచెప్పారు. కేటీఆర్ నల్గొండ వస్తుంటే కోమటిరెడ్డికి ఎందుకు అంత భయం?. నల్గొండ క్లాక్ టవర్ వద్దనే అన్ని రాజకీయ పార్టీలు కార్యక్రమాలు చేస్తాయి. సీఎం, మంత్రులు హైదరాబాద్ నగరంలో ఈడీ ఆఫీసు, రాజ్‌భవన్ ముందు ధర్నా చేస్తే ప్రజలకు ఇబ్బంది కలగలేదా?. కోమటిరెడ్డిని చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు. నల్గొండ జిల్లా అభివృద్ధిపై నాతో చర్చ చేసే దమ్ము కోమటిరెడ్డికి ఉందా?. కాంగ్రెస్ పాపాలతోనే జిల్లాలో ఫ్లోరిన్ మహమ్మారి పుట్టింది. నేను జిల్లాలో చేసిన అభివృద్ధి చూడటానికి కోమటిరెడ్డి జీవిత కాలం సరిపోదు. సొంత నియోజకవర్గాలను కోమటిరెడ్డి అభివృద్ధి చేసుకోలేదు. యాదాద్రి థర్మల్ ప్లాంట్ ఆపేస్తా అని కోమటిరెడ్డి చెబుతున్నారు. ఆయన స్పృహలో ఉండి మాట్లాడటం లేదు. సరైన పోటీ లేక నల్గొండలో కోమటిరెడ్డి గెలిచారు. భూపాల్‌రెడ్డి దెబ్బకు నల్గొండలో ఓటమి తప్పలేదు. మంత్రి ఎవరి దగ్గర ఎంత వసూలు చేశారో అన్ని విషయాలు నా దగ్గర ఉన్నాయి. చేతగాక పోలీసుల చేత పర్మిషన్ రద్దు చేయించారు. మీరు 20,30 ఏళ్ళు ఎమ్మెల్యేలుగా ఉండి ఆస్తులు పెంచుకున్నారు. కాంగ్రెస్ నేతలు ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలి అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. అంతకుముందు, మంత్రి కోమటిరెడ్డి.. నల్లగొండలో బీఆర్ఎస్ ధర్నాపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాజెక్టలను నిర్లక్ష్యం చేసిన నేతలు జిల్లాకు ఎలా వస్తారు?. రేసుల మొనగాడు దీక్ష చేస్తే రైతులు నమ్మే పరిస్థితిలో లేరు. మూడు ఫీట్లు ఉన్న వ్యక్తి మూడువేల ఓట్లతో గెలిచాడు. బీఆర్ఎస్ పార్టీ బొందలగడ్డ పార్టీ అంటూ సంచలన

## జగన్ మీకు దత్తపుత్రుడు...
# 'మోదానీ'కి దోచిపెట్టే ఏజెంట్



రివర్స్ టెండరింగ్ పేరుతో పోలవరం పనులను ఆపితే ఒక్కనాడైనా అడిగారా? రాజధాని లేని రాష్ట్రంగా 5 ఏళ్లు పాలన చేస్తుంటే కేంద్రానికి కనిపించలేదా? ఇష్టారాజ్యంగా రూ. 10 లక్షల కోట్లు అప్పులు చేస్తుంటే విధ్వంసం జరుగుతున్నట్లు అనిపించలేదా? సొంత బాబాయి హత్య కేసులో ఢిల్లీ స్థాయిలో న్యాయం కోసం పోరాటం చేస్తుంటే... కేంద్ర హెూం మంత్రిగా మౌనంగా ఎందుకున్నారు? భారీ స్థాయిలో అవినీతి జరుగుతుంటే ఒక్కటైనా బయటపెట్టారా?" అని ప్రశ్నించారు. ఐదేళ్ల పాటు జగన్ మీకు దత్తపుత్రుడు, ఆడించినట్లు ఆడే తోలుబొమ్మ, పార్లమెంట్‌లో మీ బిల్లులకు మద్దతు పలికే రబ్బర్ స్టాంప్, రాష్ట్రంలో సహజ వనరులను 'మోదానీ'కి దోచిపెట్టే ఏజెంట్ అని షర్మిల దుయ్యబట్టారు. మీ ఇష్టారాజ్యంగా 5 ఏళ్లు వైసీపీని వాడుకొని, రాష్ట్ర సంపదను దోచుకొని, ఇప్పుడు విధ్వంసం జరిగిందని మొసలి కన్నీరు కార్చితే నమ్మే అమాయకులు రాష్ట్ర ప్రజలు కారని అన్నారు. 2019-2024 మధ్య జరిగిన విధ్వంసంలో కర్త జగన్ అయితే... కర్మ, క్రియ బీజేపీ ప్రభుత్వమేనని షర్మిల చెప్పారు. 10 ఏళ్ల పాటు విభజన హామీలు నెరవేర్చకుండా మోసం చేసి, ఇప్పుడు అండగా ఉంటాం, రూ. 3 లక్షల కోట్లు ఇస్తాం, పూర్వవైభవం తెస్తామనే మీ మాటలు మరో మోసానికి నిదర్శనమని అన్నారు. మీ వ్యాఖ్యలకు మీరు కట్టుబడి ఉంటే, మీకు దమ్ముంటే... గత ఐదేళ్ల వైసీపీ పాలనపై వెంటనే కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

## అమెరికా చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా..
# అక్రమ వలసలపై ట్రంప్ సంచలన ప్రకటన




వాషింగ్టన్: మూడో ప్రపంచ యుద్ధం రాకుండా ఆపేస్తానని, చరిత్రలో కనీవినీ ఎరుగని విధంగా అక్రమ వలసదారులను దేశం నుంచి బయటకు పంపిస్తానని అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ అన్నారు. అమెరికా 47వ అధ్యక్షుడిగా మరికొన్ని గంటల్లో ట్రంప్ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ సందర్భంగా వాషింగ్టన్ డీసీలో నిర్వహించిన 'మేక్ అమెరికా గ్రేట్ ఎగెయిన్ విక్టరీ ర్యాలీని ఉద్దేశించి ట్రంప్ ప్రసంగించారు. ర్యాలీకి చాలా మంది స్నేహితులు, మద్దతుదారులు, నిజమైన అమెరికన్ దైశభక్తులు హాజరైనందుకు సంతోషంగా ఉందన్నారు. మన దేశాన్ని మనం తిరిగి స్వాధీనం చేసుకోబోతున్నాం. రేపు మధ్యాహ్నం నాటికి నాలుగేండ్ల అమెరికా క్షీణతకు తెరబడపోతున్నది. అమెరికన్ బలం, శ్రేయస్సు, గౌరవం, గర్వంతో సరికొత్త రోజును ప్రారంభించబోతున్నాం. తాను ప్రమాణ స్వీకారం తాను ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే మన దేశంపై అక్రమ వలసదారుల దండయాత్ర ఆగిపోతుంది. సరిహద్దుల నుంచి అక్రమంగా ప్రవేశించడాన్ని ఆపేస్తాం. ఇక మన సంపదను మనమే అనుభవిస్తాం. అక్రమంగా వలస వచ్చిన వేలాది మందిని బలవంతంగా సాగనంపే కార్యక్రమం అమెరికా చరిత్రలోనే భారీగా మొదలు పెడతాం. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తాం. టిక్‌టాక్ యాప్‌ను మళ్లీ తీసుకొచ్చాం. మన ఉద్యోగాలు చైనాకు పోవడానికి వీల్లేదు. అందుకే టిక్‌టాక్ యాప్‌లో అమెరికా ప్రభుత్వం 50 శాతం భాగస్వామ్యం తీసుకుంటుంది. మహిళల క్రీడల్లో ట్రాన్స్‌జెండర్లు పాల్గొనకుండా నిలువరిస్తా. మూడో ప్రపంచ యుద్ధాన్ని నిలువరిస్తా. రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపేస్తా. మధ్య ప్రాశ్చంలో శాంతి నెలకొనేలా చేస్తా. అధికారం చేపట్టకముందే ట్రంప్ ఎఫెక్ట్‌తో ఇప్పటికే కొన్ని పనులు జరిగిపోతున్నాయి. ఇది నా ప్రభావం కాదు. మీ అందరి ఎఫెక్ట్ అన్నారు. కాగా, టిక్‌టాక్‌ను తిరిగి ప్రారంభిస్తున్నామన్న ట్రంప్ ప్రకటనపై షార్ట్ వీడియో యాప్ కంపెనీ ధన్యవాదాలు తెలిపింది. బైడెన్ ప్రభుత్వ నిర్ణయంతో శనివారం నుంచి అమెరికాలో టిక్‌టాక్ యాప్ సేవలు నిలిచిపోయిన విషయం తెలిసిందే. తాను అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేసిన తర్వాత టిక్‌టాక్ యాక్సెస్‌ను పునరుద్ధరిస్తామని ట్రంప్ ప్రకటించారు. విక్టరీ ర్యాలీలో ప్రసంగిస్తూ టిక్‌టాక్‌లో అమెరికా 50 శాతం భాగస్వామ్యం తీసుకుందని చెప్పారు. దీంతో తమకు భరోసా ఇచ్చినందుకు ఈ చైనా కంపెనీ కృతజ్ఞతలు తెలిపింది.

## నిజాంపేట్ కార్పొరేషన్ ను మోడ్రన్ కార్పొరేషన్ గా అభివృద్ధి చేశాం : ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ...



కుత్బుల్లాపూర్, శుభోదయం న్యూస్ : ఈరోజు నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు కాలనీలలో సుమారు 8.69 కోట్ల రూపాయల నిధులతో నూతనంగా చేపట్టనున్న సిసి రోడ్డు, బీటీ రోడ్డు, భూగర్భ డ్రైనేజీ పనులకు ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి గారితో కలిసి శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన కార్యక్రమంలో భాగంగా నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి



భవ్యస్ ఆనందం అపార్ట్మెంట్ నుంచి హిల్ కౌంటి (2.80 కోట్లు) వరకు సీసీ రోడ్డు, హిల్ కౌంటి నుంచి రాజీవ్ గాంధీ నగర్ (1.89 కోట్లు) వరకు సీసీ రోడ్డు, వార్డ్ నెంబర్ 15,16 20 పరిధిలోని జయదీపిక ఎన్క్లేవ్ నుంచి పూజిత ఎంక్లేవ్ (1.20 కోట్లు) వరకు చేపట్టనున్న సిసి రోడ్డు పనులు, తెలుగు యూనివర్సిటీలో (1.20 కోట్లు) చేపట్టనున్న బీటీ రోడ్డు పనులు, ప్రగతి నగర్ ప్రధాన రహదారిలో (80 లక్షలతో) చేపట్టనున్న బీటీ రోడ్డు పనులు, ప్రగతి నగర్ కమాన్ నుంచి శ్రీకృష్ణ కాలనీ మీదుగా లోహిత అపార్ట్మెంట్ వరకు (80 లక్షలతో) చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ పనులకు ఎమ్మెల్యే గారు,ఎమ్మెల్సీ గార్లు శంకుస్థాపన నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ.... గత పదేళ్ల బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో శివారు మున్సిపాలిటీలు, కార్పొరేషన్లపై కేటీఆర్ ప్రత్యేక శ్రద్ధ వహించి, ఒక ప్రణాళిక బద్ధంగా ముందుకెళ్ళామని, దీనిలో భాగంగా హైదరాబాద్ నగరంలోనే నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ను మోడ్రన్ కార్పొరేషన్ గా కోట్లాది రూపాయల నిధులతో అభివృద్ధి పరచామని అన్నారు.ఈ కార్యక్రమంలో మేయర్ కొలన్ నీలా గోపాల్ రెడ్డి, డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, ఎన్ఎంసి మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలీ, కార్పొరేటర్లు బాలాజీ నాయక్, గాజుల సుజాత, ఆగం రాజు, ప్రణయ ధనరాజ్ యాదవ్, రాఘవేందర్ రావు, బొర్ర దేవి చందు, రవి కిరణ్, పైడి మాధవి, కో ఆప్షన్ సభ్యులు ఏనుగు అభిషేక్ రెడ్డి, సలీం, చంద్రగిరి జ్యోతి సతీష్, ఎన్ఎంసి బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, డివిజన్ అధ్యక్షులు సతీష్ రెడ్డి, జశ్వంత్, బొబ్బ శీను, నాయకులు ఆనంద్ రెడ్డి, కుమార్ రెడ్డి, యూత్ అధ్యక్షులు ప్రవీణ్ గౌడ్, మహిళా అధ్యక్షురాలు అర్పిత ప్రకాష్, నాయకులు విష్ణువర్ధన్, ఎస్.కె. ఖాన్, స్వామి, షేక్ సలీం, విద్యాసాగర్, సాంబశివరెడ్డి, వైయస్సార్, బిక్షపతి, దశరథ్, మహిళా నాయకురాలు స్వర్ణ, కృష్ణ మంజరి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయంలో మాజీ ఎంపీటీసీ బసగళ్ల రాములు గౌడ్ ప్రత్యేక పూజలు




శంకర్‌పల్లి, శుభోదయం న్యూస్ : శంకర్‌పల్లి మండల పరిధిలోని చందిప్ప గ్రామ శివారులో గల 11 వ శతాబ్దానికి చెందిన శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయంలో సోమవారం మండల పార్టీ మాజీ అధ్యక్షుడు, మాజీ ఎంపీటీసీ బసగళ్ల రాములు గౌడ్ స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి, స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ప్రమోద్ కుమార్ తీర్థ ప్రసాదాలు అందజేశారు. కాలభైరవుడి దగ్గర దీపాలు వెలిగించారు. అనంతరం భక్తులకు రాములు గౌడ్, అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు రాములు గౌడ్ ను శేష వస్త్రంతో సత్కరించి, స్వామి వారి చిత్రపటాన్ని బహుకరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గోవర్ధన్ రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ పరమేశ్వర్ రెడ్డి, జిల్లా బిజెపి కౌన్సిల్ సభ్యుడు వాసుదేవ్ కన్నా, మండల పార్టీ అధ్యక్షుడు లీలావతి బయానంద్, మున్సిపల్ అధ్యక్షుడు దయాకర్ రెడ్డి, యూత్ లీడర్ ప్రవీణ్ కుమార్, ఆలయ గౌరవ అధ్యక్షుడు సదానందం గౌడ్, అన్నదాన కమిటీ చైర్మన్ దర్శన్ గౌడ్ పాల్గొన్నారు.

## ఏటీఎం ను ప్రారంభించిన ఎస్సై యుగంధర్ గౌడ్



వలిగొండ, మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్): యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ పట్టణ కేంద్రంలో ని రాజీవ్ గాంధీ విగ్రహం ఎదురుగా నూతనంగా హిటాచి సంస్థ వారు ఏర్పాటు చేసిన ఏటీఎం కేంద్రాన్ని సోమవారం స్థానిక ఎస్సై యుగేందర్ గౌడ్ ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఏటీఎం కేంద్రాన్ని పట్టణ ప్రజలు రైతులు వ్యాపారులు వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం మండల అధ్యక్షుడు సాయిని యాదగిరి, ప్రముఖ వ్యాపారవేత్త భాస్కర మెడికల్ యజమాని కొండూరు భాస్కర్ గౌడ్, పబ్బు స్వామి, అయిటి పాముల ప్రభాకర్ హిటాచి ఏటీఎం నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## ఏజేఆర్ పౌండేషన్ సహకారంతో ఆర్థిక సహాయం అందజేత



వలిగొండ, మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్): యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని దాసిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన దంతూరి చంద్రయ్య గౌడ్ ఇటీవల అకాల మరణం చెందిన విషయం తెలుసుకొని ఏ జే ఆర్ ఫౌండేషన్ అధినేత ఎలిమినేటి జంగారెడ్డి సహకారంతో మృతిని కుటుంబానికి 5000/ ఐదు వేల రూపాయలు ఆర్థిక సహాయం వారి కుటుంబ సభ్యులు దంతూరి యాదయ్య, దంతూరి సత్తయ్యలకు అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు దంతూరి నరేష్ కుమార్ గౌడ్, దంతూరి శంకరయ్య దంతూరి రాములు నరేష్ శ్రీనివాస్ నరసింహ లక్ష్మయ్య సర్వయ్య నాగేష్ గోపి రాజు ఏ జే ఆర్ ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలు నిరుపేదలకు అందేలా చూడాలి

### సిపిఎం పార్టీ మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు, రైతు సంఘం జిల్లా నాయకులు పైళ్ల యాదిరెడ్డి




మోత్కూరు, మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 26 నుండి ఎంపిక చేయనున్న ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, పథకాలు నిరుపేదలకు అందేలా, గ్రామ సభల్లో రాజకీయాలకు అతీతంగా ఎంపిక చెయ్యాలని, సిపిఎం పార్టీ మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు, రైతు సంఘం జిల్లా నాయకులు పైళ్ల యాదిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. మోత్కూర్ లో వారు పత్రికా ప్రతినిధులతో మాట్లాడుతూ.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తరువాత కుటుంబ సమగ్ర సర్వే పేరుతో, పూర్తి స్థాయిలో కుటుంబ సర్వే నిర్వహించి, ప్రజా పాలన పేరుతో దరఖాస్తులు స్వీకరించిందని, ఇండ్లు లేనివారు, రేషన్ కార్డులు లేనివారు, భూమిలేని నిరుపేదలు ప్రజా పాలనలో ధరకాస్తు చేసుకున్నారని, వారి పూర్తి సమాచారం ప్రభుత్వం దగ్గర ఉందని, సర్వే ప్రకారం లబ్ధిదారుల ఎంపిక చేయకుండా మరల సర్వే పేరుతో, ధరకాస్తుల పేరుతో ప్రజలను ఎందుకు మోసం చేస్తుంన్నారో, ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేసారు. ఎన్నికల ముందు భూమిలేని నిరుపేదలకు 12000 వేలు ఇస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు సంవత్సరం లో కనీసం 20 రోజులు ఉపాధి పనికి వెళ్లిన వారికి మాత్రమే ఈ పథకం క్రింద లబ్ధిదారుల ఎంపిక చేస్తామనడం సరికాదని, ఉపాధి హామీ పనికోసం ధరకాస్తు చేసుకున్న చాలా మందికి పనికల్పించలేదని, జాబ్ కార్డుతో లింక్ లేకుండా అందరికి వర్తింప చెయ్యాలని కోరారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని ప్రభుత్వం చెప్పుతుందని, ప్రస్తుతం అర్హులైన వారందరికి ఇవ్వకుండా కొంత మందికే ఇచ్చి, ఫేస్ 1, ఫేస్ 2, అంటూ మాటలతో ప్రజలను మభ్యపెట్టి స్థానిక సంస్థల ఎన్నికల్లో పబ్బం గడుపుకోవాలని తప్ప, పథకాల అమలుకు ప్రభుత్వానికి చిత్త శుద్ధి లేదని విమర్శించ్చారు.

## ప్రభుత్వ పథకాల ఎంపిక కోసం మండల వ్యాప్తంగా గ్రామ సభలు

### వలిగొండ మండల ఎంపిడిఓ డి జితేందర్ రెడ్డి



వలిగొండ, మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్) : యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని గ్రామాల్లో మంగళవారం రోజు నుండి తెలంగాణ ప్రభుత్వం అమలు చేసి వివిధ పథకాల ఎంపిక కొరకు ఈనెల 21 నుండి 24 వరకు రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు వివిధ పథకాల ఎంపికలో భాగంగా ప్రతి గ్రామంలో గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుందని వలిగొండ ఎంపీడీవో డి. జితేందర్ రెడ్డి తెలిపారు. 21.01.2025 మంగళవారం అక్కంపల్లి, చిత్త పురం, దాసిరెడ్డిగుడెం, దుప్పెల్లి, ఎదుళ్ళ గూడెం, గోకారం,గొల్నేపల్లి, కంచెనపల్లి, నర్సయగూడెం, 22.01.2025 బుదవారం గోపరాజు పల్లి, గురునాథ్ పల్లి, కేర్చిపల్లి, లోతుకుంట, యం.తుర్కపల్లి, మందాపురం, ముద్దాపురం, నాగారం, పులిగిల్ల, సంగెం, టేకుల సోమవారం, 23.01.2025 గురువారం జంగారెడ్డిపల్లి, లింగరాజు పల్లి, మొగిలిపాక నర్సాపూరం, నాతాళ్ల గూడెం, రెడ్లరేపాక, సుంకిశాల, వలిగొండ, వర్కట్ పల్లి, వెంకటాపురం, 24.01.2025 శుక్రవారం జాలుకాలువ, నెమలి కాల్వ, పహిల్వాన్ పురం, ప్రొద్దటూర్, వెల్వర్తి, వేములకొండ, అరూర్, గ్రామాలలో గ్రామసభలు ఉంటాయని ఆయా గ్రామ సభలలో లబ్ధిదారులు పాల్గొని గ్రామసభలో లబ్ధిదారులు ఎంపికకు సహకరించాలని ఎంపీడీవో మండల ప్రజలకు తెలిపారు.

## మున్సిపాలిటీ అభివృద్ధి కోసం కృషి చేస్తా : ఎమ్మెల్యే సామేలు



మోత్కూర్, మండల రిపోర్టర్(శుభోదయం న్యూస్): మున్సిపాలిటీ అభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే సామేలు అన్నారు. సోమవారం మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మున్సిపాలిటీలో అభివృద్ధి కోసం ప్రణాళికలను సిద్ధం చేయాలని, పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్పర్సన్ కవిత, కమిషనర్, వివిధ వార్డుల కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

## సంపూ నిర్మాణం జాప్యం కాంట్రాక్టర్ నిర్లక్ష్యం పై కమిషనర్ చర్య తీసుకోవాలి



రామగుండం మండలం రిపోర్టర్-తిరుపతి(శుభోదయం న్యూస్) 20వ డివిజన్లో రైల్వే స్టేషన్ ఏరియాలోని భరత్ నగర్,తబితాశ్రమం ప్రాంతం మరియు ఎస్టి కాలనీ ప్రజల కొరకు మంచినీటి సమస్య తీర్చాలని సంపూ నిర్మాణం చేపట్టడం జరిగింది. కానీ కాంట్రాక్టర్ పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. నిర్మాణం ను జాప్యం చేస్తున్నాడు. జరిగిన నిర్మాణం లో నాణ్యత పాటించలేదు, ఇంత వరకు నీటితో క్యూరింగ్ కూడా చేయలేదు. వెంటనే నిర్మాణం పూర్తి చేయాలని ఎన్నిసార్లు కోరిన కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడు. నెలరోజులుగా పైగా ఇబ్బంది పెడుతున్నారు. ప్రజలతో కలిసి నల్ల కండువలతో నిరసనలు, ఆందోళన కార్యక్రమాలు చేపట్టడానికి కూడా సిద్ధంగా ఉన్నాము. కావున కమిషనర్ గారు మీరు ప్రత్యేక చొరవ తీసుకొని వెంటనే కాంట్రాక్టర్ పై చర్య తీసుకుంటూ సంపూ నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేపించాలని మిమ్మల్ని ప్రత్యేకంగా కోరడం జరుగుతున్నది.

## గీత కార్మికులకు జరుగుతున్న అన్యాయంపై ఆర్టిఐ సమాచారం కొరకు ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరిండెంట్ భాస్కర్ ను కలిసిన ఎన్ హెచ్ ఆర్ సి



గోదావరిఖని టౌన్ రిపోర్టర్- సురేష్,(శుభోదయం న్యూస్) ఎన్ టి పి సి,ప్రభావిత గ్రామాలై, ఎల్కలపల్లి,లక్ష్మీపురం గీత కార్మికులుఎదుర్కొంటున్న సమస్యలపై ఈరోజు ఆర్టీసీ ద్వారా పూర్తి సమాచారం అందించాలని పెద్దపల్లి జిల్లా ఎక్సైజ్ అసిస్టెంట్ సూపర్డెంట్ ను కోరడం జరిగింది కొన్ని సంవత్సరాల నుంచి అదే వృత్తిని నమ్ముకునిబతుకుతున్న గీత కార్మికులు ఇప్పుడు ఎన్టిపిసి బూడిద చెరువు కొరకు సోలార్ ప్లాంట్ కొరకు చెట్లు మొత్తం తొలగించడం ద్వారా జీవనోపాధి కోల్పోయిన గౌడ కులస్తులకు అరకురా నష్టపరిహారం ఇచ్చి మీకు చెట్లపై ఎలాంటి హక్కు లేదని అంటున్నారని,నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ జస్టిస్ మూమెంట్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు"వడ్లకొండ మహేందర్ గౌడ్"కు తెలుపగా ఈరోజు పూర్తి సమాచారం 'ఆర్ టీ ఐ' ద్వారా ఇవ్వాలని ఎక్సైజ్ అసిస్టెంట్ సూపర్డెంట్ భాస్కర్ ను కోరినట్లు తెలిపారు,తర్వాత కలెక్టరేట్ ఆఫీస్ లో పౌర సమాచార అధికారిని"ఆర్ టి ఐ"సమాచారం ఇవ్వాలని కోరినట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో ఎన్ హెచ్ ఆర్ సి,పెద్దపల్లి జిల్లా లీగల్ సెల్ అధ్యక్షులు నామతాబాద్ కిరణ్ జి,ఉపాధ్యక్షులు కర్రావులరామరాజు.తదితరులు పాల్గొన్నారు.

## గోదావరిఖని గౌతమ్ నగర్ లో వాసవి క్లబ్ ద్వశాబ్ది వార్షికోత్సవం2025





రామగుండం మండలం రిపోర్టర్-తిరుపతి,(శుభోదయం న్యూస్) తేదీ 20-01-2025 రోజున గౌతమ్ నగర్ లో వాసవి క్లబ్ గోదావరిఖని ద్వధ్వశాబ్ది వార్షికోత్సవం పురస్కరించుకొని 2025 సంవత్సరం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీసీఐ ఉపాధ్యక్షులు కటుకం హరీష్, మరియు ప్రమాణ స్వీకారోత్సవ కమిటీ చైర్మన్ వి ఐ ఓ జె ఏ జిల్లా గవర్నర్ ఇల్లందుల కిషోర్ కుమార్, నూతన అధ్యక్ష కార్యదర్శులు కోశాధికారులలో ప్రమాణ స్వీకారం చేయించి జిల్లా కార్యదర్శి కోశాధికారులలో ప్రమాణ స్వీకారం చేయించి జిల్లా కార్యదర్శి అడ్మినిస్టర్ జైన అర్చన జిల్లా కార్యదర్శి కొంకుమట్టి వెంకటేశ్వర్లు, మరియు డిస్టిక్ వైస్ గవర్నర్ పుల్లారి బాలమోహన్, ఇతర కమిటీ సభ్యులతో ప్రమాణస్వీకారం. ఈ కార్యక్రమంలో అల్లంకి లచ్చయ్య, ఇంటర్నేషనల్ ప్రోగ్రాం ఆర్గనైజేటర్ గడ్డం రవీందర్, జిల్లా ప్రోగ్రాం కో బొల్లం అనిల్ కుమార్, అనంతుల రాజశేఖర్ లతో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు నటరాజ్ శేఖర్, మరియు వాసవి క్లబ్ ఇన్చార్జ్ ప్రెసిడెంట్ వేదికపై ఆశీనులైనారు. జిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్ గడ్డం రవీందర్ ఆహ్వానం అతిథుల నో వేదిక పైకి ఆహ్వానించారు ఈ కార్యక్రమానికి 2024 సంవత్సరం క్లబ్ అధ్యక్షులు మోతిపాటి ఆనంద్ బాబు సభ అధ్యక్షత వహించి తర్వాత 2025వ సంవత్సరం అధ్యక్షులుగా నియమించిన బడిన అధ్యక్షుడు గుండా రమేష్, మోద శ్రీనివాస్, కేశెట్టి శ్రీరాములు, కు బాధ్యత అప్పగించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న విఎన్ కటకం హరీష్ వాసవి క్లబ్ సేవ కార్యక్రమాలను వివరించారు ఈ సమావేశంలో 17 గురు కే సి జి ఎఫ్ సభ్యత్వం తీసుకోవా 2024 సంవత్సరం వాసవి క్లబ్ అధ్యక్షుడు విఎన్ మూర్తి పార్టీ ఆనంద్ బాబు 25వేల రూపాయలతో సిల్వర్ స్టార్ కేసీజిఎఫ్ సభ్యునిగా చేరారు వారందరికీ ముఖ్య అతిథి మరియు జిల్లా గవర్నర్ తదితరులు భావికరించి సత్కరించారు. 2005 సంవత్సరం నుండి అధ్యక్షులుగా కొనసాగిన పూర్వ అధ్యక్షులను మరియు వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అతిథులను సత్కరించారు

## వేల గొంతులు - లక్ష డప్పులు దండోర సాంస్కృతిక మహా ప్రదర్శన

### మాదిగ సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం



గోదావరిఖని టౌన్ రిపోర్టర్- సురేష్,(శుభోదయం న్యూస్) సోమవారం రోజున మాదిగ ఐక్య వేదిక, మాదిగ మిత్ర మండలి, పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు భుషిపాక సంతోష్ మహారాజ్ ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీన పెద్దపెల్లి జిల్లా కేంద్రంలో జరిగే శ్రీ మంద కృష్ణ మాదిగ సభా కార్యక్రమాల విజయవంతం కోసం, సోమవారం, 20,01,2025, నా గోదావరిఖని పట్టణంలోని శ్రీ లక్ష్మీ ఫంక్షన్ హాల్లో సన్నాహక సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మాజీ శాసనసభ్యులు శ్రీ కాసిపేట,లింగయ్య మాదిగమిత్ర మండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీ కోటగిరి పాపయ్య, హాజరై కార్యక్రమాన్ని నిర్వహించారు మాదిగ ఉపకులాలు మాదిగ సంఘాలు వివిధ రాజకీయ పార్టీలో ఉన్న మాదిగ నాయకులు మరియు మున్సిపల్ కార్మిక నాయకులు సింగరేణి కార్మిక నాయకులు, ఎమ్మార్పీఎస్ రామగుండం ఇన్చార్జి రేణిగుంట్ల సాగర్, హాజరు కావడం జరిగింది ఈ సమావేశంలో అందరి సమక్షంలో రామగుండం నియోజకవర్గం



మాదిగ ఐక్య వేదిక కన్వీనర్ గా మాజీ ఎమ్మెల్యే కాజీపేట లింగన్న ని, కో-కన్వీనర్ గా మాదిగమిత్ర మండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు కోటగిరి పాపయ్య ని మరియు 25 మంది సభ్యులతో కమిటీ ఎన్నుకోవడం జరిగింది ఫిబ్రవరి 7 న హైదరాబాదులో వేయి గొంతులో లక్షతప్పుల కార్యక్రమం నియోజవర్గ స్థాయి మరియు మాదిగ బస్తీర్ల ప్రచారం చేస్తూ, ఊరు ఊరుల గ్రామ గ్రామాన తిరుగుతూ కవులు కళాకారులు మమేకం చేసి పెద్ద ఎత్తున కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలి వెళ్లాలని నిర్ణయించారు.ఈ కార్యక్రమానికి ట్రేడ్ యూనియన్ నాయకులు మద్దతుగా వచ్చారు వివిధ గ్రామాల నుంచి మాదిగ మాదిగ ఉపకుల కుల బంధువులు హాజరైనారు ఈ కార్యక్రమంలో ఏఐటియుసి కవంపల్లి స్వామి వడ్డేపల్లి శంకర్, పర్లపెల్లి రవి, కార్పొరేటర్ పాముకుట్ల భాస్కర్, సిఐటియు యాకన్న దాసరి ఎల్లన్న, తడగొండ నరసయ్య, ఇదినూరు పర్వతాలు, ఇదినూరు నర్సింగ్, కార్పొరేటర్ కాలువల సంజీవ్ ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం నాయకులు మైస రాజేష్, బొంకురి మధు, ఖాంపెల్లి సతీష్, బిజెపి యువ నాయకుడు మచ్చ విశ్వాస్ మాదిగ హక్కుల దండోరా వడ్లురి శ్రీనివాస్, కొట్టపెల్లి దుర్గ ప్రసాద్, ఎమ్మార్పీఎస్ నాయకులు పల్లె బాబు, కన్నూరి ధర్మేందర్, ప్రభాకర్,రాసపల్లి రవి, కుమార్, ఐఎఫ్టియు జిల్లా అధ్యక్షులు చిలక శంకర్, సిపిఐ నాయకులు శనిగారపు చంద్రశేఖర్, రేణిగుంట్ల ప్రీతం, ఎలుక పెల్లి సురేష్, అడ్వకేట్ ఇరువురాళ్ల సంతోష్, కనుకుంట్ల సమ్మయ్య, దళిత సంఘం నాయకులు కలవల మహేందర్, మచ్చ విశ్వాస్, డాక్టర్ అసంపల్లి ఆనంద్ బాబు, మామిడిపల్లి శ్రీనివాస్,ముత్యాల సర్పంచి లావణ్య నాగరాజు, అల్లి గణేష్,, ఎస్సీఆర్పిఎస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు నిర్మల, అజయ్, కుక్క గంగా ప్రసాద్, రామగుండం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన వివిధ ప్రాంతాల నుండి పార్టీలకు రాజకీయాలకు కార్మిక సంఘాలకు దళిత సంఘాలకు అతీతంగా పాల్గొనడం జరిగింది.

# కార్మిక హక్కుల రక్షణకై పోరాడుదాం. కొత్త లేబర్ చట్టాల రద్దుకై ఉద్యమిద్దాం పాత పనివేళలను



గోదావరిఖని టౌన్ రిపోర్టర్- సురేష్(శుభోదయంన్యూస్ నాడు సోమవారం రోజున గోదావరిఖని కార్యాలయంలో ట్రేడ్‌యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా టీ యు సి ఐ పెద్దపెల్లి జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి టి యు సి ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు తోకల రమేష్ హాజరై మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం పోరాడి సాధించుకున్న హక్కులపై దాడిని కొనసాగిస్తున్నది 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్ లుగా మార్చి నిర్బంధంగా అమలకు పూనుకుంటున్నది. కార్పొరేట్ శక్తులకు అనుగుణంగా కార్మిక చట్టాలను రూపొందించి కార్మిక వర్గాన్ని బానిసలుగా తయారు చేసేందుకు కుటీలప్రయత్నాలను కొనసాగిస్తున్నది. ఈ విధానాలను కార్మిక వర్గం ప్రకటించకపోతే పెను ప్రమాదం తప్పదు. కార్మిక వర్గం ఐక్యంగా లేబర్ చట్టాలనుతిప్పికొట్టాల్సిన అవసరం ఉన్నది.ఎన్ టి పి సి యాజమాన్యం దొడ్డి దారిన నూతన కార్మిక చట్టాలను అమలు చేసేందుకు తెగ ఉత్సాహాన్ని చూపుతున్నది. కార్మికుల పని వేళలను మార్చాలని కాంట్రాక్టర్లకు నోటీసులు ఇచ్చింది. ఇది కార్మిక వర్గ హక్కులపై దాడిగానే చూడాలి. 8 గంటల పని విధానాన్ని రద్దు చేసే కుట్రలో భాగంగా పని వేళలు మార్చి 12 గంటల పని విధానాన్ని ప్రవేశపెట్టే కుట్రలో భాగంగా ఎన్టిపిసి యాజమాన్యం నోటీసులు ఇచ్చింది. వెంటనే కాంట్రాక్టర్లకు ఇచ్చిన నోటీసులను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నాం. పాత పనివేళలో యధావిడిగా కొనసాగించాలని డిమాండ్ చేస్తున్నాం లేనట్లయితే ప్రతిఘటన తప్పదని తెలియజేస్తున్నాం. ఇంకా ఈ సమావేశంలో ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా టి యు సి పెద్దపెల్లి జిల్లా నాయకులు ఆడెపు శంకర్, గూడూరి వైకుంఠం, గొల్లపల్లి చంద్రయ్య, మారుతి రాములు, కలవల రాయమల్లు, తదితరులు పాల్గొన్నారు.

# క్రిస్టియన్ అండ్ పాస్టర్ అసోసియేషన్ కమిటీ రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నిక




పటాన్చెరు : (శుభోదయం న్యూస్)సోమవారం నాడు పటాన్ చెరువు నియోజకవర్గంలోని మండలాలు డివిజన్లు మున్సిపాలిటీలోని పాస్టర్స్ అందరు కలిసి క్రిస్టియన్ అండ్ పాస్టర్ అసోసియేషన్ పటాన్చెరువు 40 కమిటీని రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కమిటీకి ప్రెసిడెంట్ గా పాస్టర్ ప్రశాంత్ వేలేటి సెక్రటరీగా జోసెఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ గా శంకర్ ట్రెజరర్ గా యోహాను చైర్మెన్ గా దినకర్ పాస్టర్ ని ఎన్నుకోవడం జరిగింది. అలాగే శాఖలుగా వైస్ ప్రెసిడెంట్ అడ్వైజర్ మెంబర్ యూత్ మెంబర్స్ ఆర్గాని సింగ్ మెంబర్స్ బిషప్ మెంబర్స్ లీకల్ మెంబర్స్ యూత్ మెంబర్స్ ని కూడా ఎన్నుకోవడం జరిగింది. ప్రెసిడెంట్ పాస్టర్ ప్రశాంత్ వేలేటి మాట్లాడుతూ తన మీద నమ్మకంతో మరోసారి అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు కమిటీలో ఎన్నుకోబడిన ప్రతి ఒక్కరూ ముందుండి నడిపించాలని క్రైస్తవ సమాజానికి కష్టపడి పనిచేయాలని సూచిస్తూ దాన ధర్మ కార్యాలలో ముందుండి నియోజకవర్గంలోని పాస్టర్స్ అందర్నీ ముందుకు తీసుకు వెళ్తానని తన వంతు కృషి చేస్తానని ఏసుప్రభు చెప్పినట్లుగా ప్రేమతో శాంతియుతంగా అధికారుల అండదండలతో రాజకీయ నాయకుల సపోర్టుతో అన్ని శాఖలను కలుపుకొని ముందుకు తీసుకుపోతానని తెలియజేయడం జరిగింది.

# బీరంగూడ వాటర్ బోర్డ్ ఎఈ ప్రవీణ్ ని కలిసిన ఈర్ల రాజు ముదిరాజ్





అమీన్పూర్ : (శుభోదయం న్యూస్) అమీన్పూర్ మండలం కిష్టారెడ్డిపేట్ మరియు పటేల్ గూడా గ్రామాల పరిధిలోగల కాలనీలకు మిషన్ భగీరథ డ్రింకింగ్ వాటర్ కలెక్షన్ కొరకై అమీన్పూర్ బిజెపి మండల అధ్యక్షులు ఈర్ల రాజు ముదిరాజ్ ఆధ్వర్యంలో బీరంగూడ వాటర్ బోర్డ్ ఏఈ ప్రవీణ్ కుమార్ ని కలిసి మా యొక్క కాలనీలో జియో ట్యాగ్ చేసిన ఇండ్లకు కలెక్షన్లు అతి తొందరలో ఇయ్యాలని కోరడం జరిగింది. అదేవిధంగా జియో ట్యాగ్ చేయని ఇండ్లకు మరియు అపార్ట్మెంట్స్ కు జియో ట్యాగ్ చేయాలని బిజెపి మండల అధ్యక్షుడు ఈర్ల రాజు ముదిరాజ్ ఏఈ గారిని కోరడం జరిగింది.ఈ విషయంలో మెదక్ పార్లమెంట్ రఘునందన్ రావు వాటర్ బోర్డు ఏఈ ప్రవీణ్ కుమార్ తో వారి ఉన్నత అధికారులతో మాట్లాడి అమీన్పూర్ మండలంలోని కాలనీ ప్రజలకు అతి తొందరలో డ్రింకింగ్ వాటర్ ఇవ్వాలని వాటర్ బోర్డు అధికారులను కోరడం జరిగింది.ఎంపీ అధికారులకు చెప్పడంతో వాటర్ బోర్డు ఏఈ ప్రవీణ్ కుమార్ సానుకూలంగా స్పందిస్తూ ఈనెల జనవరి 24వ తేదీ రోజు పటేల్ గూడ రిజర్వాయర్ను ఓపెన్ చేయడం జరుగుతుంది అన్నారు. అదేవిధంగా అతి త్వరలో కిష్టారెడ్డిపేట్ ద్వారకా నగర్ బృందావనం కాలనీ మేయర్ వల్లి కాలనీ లకు మరియు వివిధ కాలనీలకు అపార్ట్మెంట్స్ కు వాటర్ సప్లై ఇవ్వడం జరుగుతుందని అన్నారు. మరియు మండలంలోని మిగతా కాలనీలకు దశలవారీగా జియో ట్యాగ్ చేసి అతి తొందరలో వాటర్ సప్లై ఇస్తామని ఏఈ హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ బిజెపి మండల ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీకాంత్, మండల బిజెపి కోశాధికారి రాకేష్,మెహర్ వలి కాలనీ సొసైటీ అధ్యక్షులు రాజేందర్ గౌడ్,బృందావనం కాలనీ నాయకులు సత్యం బిజెపి బూత్ అధ్యక్షులు కుమార్ గౌడ్,రామ్ కిషన్,సందీప్. బిజెపి నాయకులు పాల్గొన్నారు.

# కోమటిరెడ్డి ప్రతీక్ రెడ్డి, సుశీలమ్మ ఫౌండేషన్ నిరుపేదలకు చేస్తున్న సేవలు అభినందనీయం : కోమటిరెడ్డి ఇంద్రారెడ్డి



వలిగొండ, మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్) : కోమటిరెడ్డి ప్రతీక్ రెడ్డి, సుశీలమ్మ ఫౌండేషన్ నిరుపేదలకు చేస్తున్న సేవలు అభినందనీయమని, కోమటిరెడ్డి ఇంద్రారెడ్డి అన్నారు. మండల పరిధిలోని పులిగిల్ల గ్రామానికి చెందిన కోమటిరెడ్డి ఇంద్రారెడ్డి సోమవారం రోడ్ల భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిలను కలిసి కోమటిరెడ్డి ప్రతిక్ రెడ్డి,సుశీలమ్మ ఫౌండేషన్ కు కోమటిరెడ్డి బ్రదర్స్ అయినా కోమటిరెడ్డి అనంతరెడ్డి, కోమటిరెడ్డి ఇంద్రారెడ్డి, కోమటిరెడ్డి రవీందర్ రెడ్డి, కోమటిరెడ్డి మహేశ్వర్ రెడ్డిలు లక్ష రూపాయల విరాళాన్ని మంత్రి వెంకట్ రెడ్డి,ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డికి అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోమటిరెడ్డి ప్రతిక్ రెడ్డి, సుశీలమ్మ,ఫౌండేషన్ ఏర్పాటు చేసి నిరుపేదలకు సేవా కార్యక్రమాలు చేయడం ఎంతోఅభినందనీయమన్నారు.ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెన్నో చేయాలని కోరారు.

# జిన్నారం మండలం రాళ్లకత్వలో ఘనంగా మల్లన్న జాతర ముఖ్య అతిథులుగా హాజరైన బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గోవర్ధన్ రెడ్డి మాజీ జెడ్పిటిసి కొలన్ బాల్ రెడ్డి



జిన్నారం : (శుభోదయం న్యూస్)జిన్నారం మండలం రాళ్లకత్వ గ్రామ పరిధిలో శ్రీ మల్లన్న జాతరను ఆలయ నిర్వహకులు గ్రామ ప్రజలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయ



నిర్వాహకుల ఆహ్వానం మేరకు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి మాజీ జెడ్పిటిసి కొలన్ బాల్ రెడ్డి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారిని ఆలయ నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు రాలకత్వ గ్రామ ప్రజలు ఆలయ నిర్వహకులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులకు ఘన సన్మానం



పాపన్నపేట, మండల రిపోర్టర్ రవి, (శుభోదయం న్యూస్):ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయిలో అబాకస్ పరీక్షలో ఉత్తమ ప్రతిభను కనబరిచి శ్రీవిద్య పాఠశాల విద్యార్థులు మూడు కేటగిరీలలో జిల్లాలో ఉత్తమ అవార్డు సాధించారు.ఈ సాధన కోసం విద్యార్థులకు చక్కటి నైపుణ్యం నేర్పించిన ఉపాధ్యాయ బృందానికి శ్రీవిద్య



పాఠశాల యజమాన్యం ఘనంగా సన్మానించారు.సోమవారం మండల కేంద్రమైన పాపన్నపేటలో శ్రీవిద్య పాఠశాలలో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు అభినందించి మెమొంటూ ను అందజేశారు.అలాగే వారి సాధనకు కృషి చేసిన ఉపాధ్యాయురాలు స్రవంతి,ఇందిరా,అనురాధ,దుర్గా, శ్వేత,ప్రియాంక లను శాలువతో ఘనంగా సన్మానించారు.వారినీ విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.ఈకార్యక్రమంలో ప్రిన్సిపల్ రవీందర్ గుప్తా,కరస్పాండెంట్ నిట్టలాక్షప్ప,సుమన్ పాఠశాల ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

# టీచర్లపై దాడులు అరికట్టాలి :ఉపాధ్యాయ సంఘాల డిమాండ్



పాపన్నపేట, మండల రిపోర్టర్ రవి, (శుభోదయం న్యూస్):ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులపై అరాచక శక్తుల దాడులను అరికట్టాలని ఉపాధ్యాయ సంఘాల పిలుపుమేరకు పాపన్నపేట ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు సోమవారంనల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు.రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాములు పై దాడి చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని కోరారు.పాఠశాలలో ఓఅరాచక శక్తుల జోక్యం పట్ల కఠినంగా వ్యవహరించి ఉపాధ్యాయులకు రక్షణ కల్పించాలని,బాధ్యులను వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు.ఈసందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహేశ్వర్,పిఆర్టియు నాయకులు ప్రవీణ్,నింగప్ప, తో పాటు ఉపాధ్యాయులు వేణుగోపాల్ రెడ్డి,రియాజ్, మంగ నర్సింలు,మోహన్ రావు,చంద్రమోహన్,రమేష్ , రవికాంత్,శ్రీహరి,శ్రవణ్ కుమార్,విశ్వనాథ్,పద్మ, మునావత్ రజిత,నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# మొబైల్ ఫుడ్ కోర్ట్ ను ప్రారంభించిన....

## పెద్దపెల్లి జిల్లా అదనపు కలెక్టర్ నగరపాలక కమిషనర్ జె.అరుణశ్రీ, నగర మేయర్ బంగి అనిల్ కుమార్



రామగుండం మండలం రిపోర్టర్-తిరుపతి(శుభోదయం న్యూస్) ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ రుణాలుసద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా తమ కాళ్ళ మీద తాము నిలబడేందుకు ప్రయత్నం చేయాలని రామగుండం నగర మేయర్ బంగి అనిల్ కుమార్ అన్నారు. సోమవారం స్వశక్తి మహిళలు ఏర్పాటు చేసుకున్న మొబైల్ ఫుడ్ కోర్ట్ ను పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు ) , రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణ శ్రీ తో కలిసి సోమవారం సాయంత్రం రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయ ఆవరణలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశ్రామిక వేత్తలుగా మహిళలు ఎదగడానికి ప్రభుత్వం అనేక ప్రోత్సాహకాలను అందిస్తుందని అన్నారు. రామగుండం శాసన సభ్యులు ఎం ఎస్ రాజ్ ఠాకూర్ , జిల్లా మంత్రివర్యులు శ్రీధర్ బాబు , రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు రేవంత్ రెడ్డి సహకారంతో ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకొని రామగుండం స్వశక్తి మహిళలు క్యాంటీన్లు , ఇతరత్రా స్వయం ఉపాధి యూనిట్లు స్థాపించుకోవాలని అన్నారు. పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు ) , రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణ శ్రీ మాట్లాడుతూ మెప్మా




సహకారంతో రుణాలు పొంది స్వయం ఉపాధి యూనిట్లు స్థాపించుకొని స్వశక్తి మహిళలు ఆర్థికంగా ఎదగాలని అన్నారు. మొబైల్ ఫుడ్ కోర్ట్ ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చిన 22 వ డివిజన్ క్రషర్ నగర్ కు చెందిన సిరి చందన మహిళా పొదుపు సంఘం ( కల్ప వృక్షం మహిళా సమాఖ్య ) సభ్యురాళ్లను అభినందించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు బాల రాజ్ కుమార్ , శంకర్ నాయక్ , నాయకులు పాతపెల్లి ఎల్లయ్య, నగర పాలక సంస్థ ఇ ఇ రామన్ , మెప్మా టి ఎం సి మౌనిక , సి ఓ లు , ఆర్ పిలు , సిరి చందన మహిళా పొదుపు సంఘం సభ్యురాళ్ళు లావణ్య , సంధ్యా రాణి , పట్టణ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు నూనె లతా మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# నిజాంపేట్ మునిసిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ మహిళ అధ్యక్షురాలుగా కడియాల ఇందిర, ప్రధాన కార్యదర్శిగా నన్నపనేని యశోద దేవి



కుత్బుల్లాపూర్, శుభోదయం న్యూస్ : నిజాంపేట్ మునిసిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ మహిళ అధ్యక్షురాలుగా కడియాల ఇందిర, ప్రధాన కార్యదర్శి గా నన్నపనేని యశోద దేవి, ఉపాధ్యక్షురాలిగా గూడురు గిరిజా కుమారి



మరియు 14 డివిజన్ అధ్యక్షురాలిగా శ్రీదేవి గార్లను నియమించిన సందర్భంగా ఈరోజు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి గారిని మర్యదాపూర్వకంగా కలిశారు అనంతరం హన్మంతన్న శాల్వాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేసారు.

# గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధం



మోత్కూర్, మండల రిపోర్టర్(శుభోదయం న్యూస్ ): యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మున్సిపల్ లోని అంగడి బజారు లో గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధమైన ఘటన ఆదివారం అర్ధరాత్రి జరిగింది. ఇంటి యజమాని మెండే అండాలు తెలిపిన వివరాలిలా.. రాత్రి ఒంటిగంట సమయంలో సిలిండర్ పేలింది. ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. కట్టుకోవడానికి బట్టలు, వండుకోవడానికి గిన్నెలు కూడా లేకుండా కాలిపోయాయని బాధితులు వాపోయారు.

# టి.సువర్ణ కుమారికి డాక్టరేట్



హైదరాబాద్, (శుభోదయం న్యూస్): చైతన్య భారతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సిబిఐటి )లో సిఎస్ఇ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న టి సువర్ణ కుమారికి ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ లభించినట్లు సీబీఐటీ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ డాక్టర్ జి ఎన్ ఆర్ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాదులోని గీతాంజలి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రొఫెసర్ మరియు ప్రిన్సిపల్ డాక్టర్ కె. సాగర్ పర్యవేక్షణలో "సహకార వడపోతలో నాణ్యతను పెంచే సెమాంటిక్ అప్రోచ్" అనే తన థీసిస్‌ను విజయవంతంగా సమర్పించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ టి.సువర్ణ మాట్లాడుతూ వినియోగదారుల బ్రౌజింగ్ అనుభవాలను మెరుగుపరచడంతోపాటు వారికి వ్యక్తిగతీకరించిన సమాచారాన్ని రికమండేషన్ సిస్టమ్‌ల ద్వారా అందించడంపై తన థీసిస్ దృష్టి సారించిందని పేర్కొన్నారు. సహకార వడపోత విధానాలలో పురోగతి ఉన్నప్పటికీ, డేటా స్పార్సిటీ, స్కేలబిలిటీ పరిమితులు మరియు కోల్డ్-స్టార్ట్ సమస్య వంటి సమస్యలు సినిమా సిఫార్సు సిస్టమ్‌లలో కొనసాగుతున్నాయి. ఆమె పరిశోధన సిఫార్సుదారు సిస్టమ్‌ల నాణ్యతను పెంచడానికి సెమాంటిక్ విధానాన్ని ఉపయోగించి ఈ సవాళ్లను పరిష్కరిస్తుంది.సిబిఐటి ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సివి నరసింహులు, సిఎస్ఇ డిపార్ట్‌మెంట్ సిబ్బందితో పాటు, ఆమె కృషిని మరియు ఈ అద్భుతమైన విజయాన్ని అభినందించారు.

## ఎమ్మెల్యే జనార్ధన్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన - ఎం నిడమనూరు టిడిపి నాయకులు



టంగుటూరు మండల రిపోర్టర్ :- వెంకటేశ్వర్లు టీ (శుభోదయం న్యూస్) :- రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ జన్మదినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని ఎం నిడమనూరుకు చెందిన టిడిపి గ్రామ అధ్యక్షులు కాకుమాని శ్రీకాంత్ టంగుటూరు మండల ఐటిడిపి అధ్యక్షులు కాకుమాని శ్రీనివాస్ టిడిపి సీనియర్ నాయకులు కొత్తపల్లి వెంకయ్య ఈ సందర్భంగా సోమవారం వల్లూరులో జరిగిన కార్యక్రమంలో జనార్ధన్ కు ప్రత్యేక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎం నిడమనూరు గ్రామానికి చెందిన టిడిపి శ్రేణులు పాల్గొన్నాయి.

## టంగుటూరు పొగాకు బోర్డు ఆధ్వర్యంలో విజ్ఞాన యాత్ర కార్యక్రమం!



టంగుటూరు మండల రిపోర్టర్ :- వెంకటేశ్వర్లు టీ (శుభోదయం న్యూస్) :- టంగుటూరు పొగాకు బోర్డు ఆధ్వర్యంలో రైతులకు, క్షేత్రస్థాయి సిబ్బందికి అవగాహన కల్పించే క్రమంలో భాగంగా విజ్ఞాన యాత్రను ప్రారంభించడం జరిగిందని వేలం నిర్వహణ అధికారి అట్లూరి శ్రీనివాసరావు సోమవారం పేర్కొనడం జరిగింది. ఈ క్రమంలో భాగంగా చీరాలలోని ఐటిసి గ్రీన్ లీఫ్ ట్రస్సింగ్ ప్లాంట్ను సందర్శించడం



జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాంట్లో జరిగే ప్రాసెసింగ్ అంతర్జాతీయ ప్రమాణాలు అదేవిధంగా పొగాకు అన్య పదార్థాలను వేరు చేసే విధానాన్ని గురించి తదితర అంశాలపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పొగాకు బోర్డు సిబ్బంది టంగుటూరు వేలంకేంద్రం పరిధిలోని రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

## తుమ్మకోట అటవీ ప్రాంతంలో పులిజాడ కాన రాలేదు: అటవీ సిబ్బంది




రెంటచింతల, మండల రిపోర్టర్ - శ్రీనివాసరావు (శుభోదయం న్యూస్) : తుమ్మకోట అటవీ ప్రాంతంలో పెద్దపులి సంచరించి తమ ఆవులమందలోని లేగ ఆవు దూడపై దాడి చేసిందన్న పశువుల కాపరులు ఆదివారం వెల్లడించిన సమాచారంతో మాచర్ల అటవీ శాఖ సిబ్బంది సోమవారం ఉదయం తుమ్మకోట నుంచి స్థానిక 15 మంది గ్రామస్తులను తోడ్కొని అటవీ ప్రాంతానికి బయలుదేరారు. పశువుల కాపరులు పేర్కొన్న పులి దాడి చేసిన ప్రాంతమైన నెమలిశెల తుమ్మకోటకు 5 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఘటనా స్థలిలో శిరిగిరిపాడు సెక్షన్ బీట్ అధికారి సత్యనారాయణ మాట్లాడుతూ తమకు పులిజాడ ఆనవాళ్ళు ఎక్కడా కనిపించలేదన్నారు. లేగ ఆవుదూడ కొద్దిపాటి



గాయంతో ఉండటం తాము గమనించి పశువుల కాపరులకు అప్పజెప్పినట్లు తెలిపారు. గాయమైన లేగ దూడ అరుపులకు ఆవుల మంద చెల్లా చెదురు కావడంతో పశువుల కాపరులు హుస్సేన్ నాయక్, బాలు నాయక్ లు పులి దాడి చేసిందన్న అనుమానంతో భయాందోళనకు గురై అక్కడ నుంచి పరారై కేకలు వేసుకుంటూ స్థానికులకు తెలిపారన్నారు. లేగదూడ సురక్షితంగా ఉన్నది కాబట్టే ఆ ప్రాంతంలో పులి సంచరించిన జాడ కనిపించలేదని పేర్కొన్నారు. పులిజాడ అన్వేషణకు బయలుదేరిన అటవీ సిబ్బందిలో బీట్ అధికారి కె విజయనిర్మల, వాచర్లు లింగయ్య, నాసరయ్య, చెక్ పోస్ట్ హెల్పర్ శివ నాయక్ తదితరులున్నారు.

## సంక్రాంతి బహుమతిగా ముగ్గురికి సొసైటీ ఛైర్మన్ల నియామకం



రెంటచింతల, మండల రిపోర్టర్ - శ్రీనివాసరావు (శుభోదయం న్యూస్) : సహకార సంస్థలు, మార్కెట్ కమిటీల పదవులను జనవరి నెలలో భర్తీ చేయడానికి ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించింది. వ్యవసాయ సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించే ముందు వాటికి నామినేటెడ్ పాలకవర్గాలను నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో గ్రామస్థాయి నుంచి అనేక పదవులు క్షేత్రస్థాయి నేతలకు కేటాయించనున్నారు. వాటిలో రిజర్వేషన్లు ప్రత్యేకంగా లేకపోయినా స్థానిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సామాజిక న్యాయం పాటించాలని ప్రభుత్వం సూచించింది. నియామక ప్రక్రియను ఎమ్మెల్యేలు అందజేసిన ప్రతిపాదనల ఆధారంగా ఖరారు బాధ్యతను ఇంచార్జి మంత్రికి అప్పగించింది. ఈ క్రమంలో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి మండలంలోని నేతలు ముగ్గురికి సంక్రాంతి బహుమతిగా నామినేటెడ్ పదవులు ఇచ్చారు. రెంటచింతల సొసైటీ ఛైర్మన్ గా తుమ్మా జోజిరెడ్డి, పాల్వాయి సొసైటీ ఛైర్మన్ గా అల్లం బ్రహ్మారెడ్డి, మంచికల్లు సొసైటీ ఛైర్మన్ గా ఎరపతినేని మట్టయ్య లో పేర్లు ప్రకటించారు. రైతులకు సకాలంలో ఎరువులు అందించటంతో పాటు రుణ పరపతి సౌకర్యం కల్పించి సొసైటీ అభివృద్ధికి దోహదపడతామని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## బొబ్బిలి డిఎస్పీ శ్రీనివాసరావు పై ఓ మహిళా ఫిర్యాదు



విజయనగరం జిల్లా, (శుభోదయం న్యూస్ ):బొబ్బిలి డిఎస్పి పి శ్రీనివాసరావు పై విజయనగరం జిల్లా కేంద్రం స్థానిక ఎస్పి కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్ సెల్) లో ఓ మహిళ ఫిర్యాదు చేసింది. ఇందుకు సంబంధించి బాధితురాలు తెలిపిన వివరాల్లోకి వెళితే... బొబ్బిలి మండలం పారాది గ్రామానికి చెందిన నగర పోలమ్మ అనే మహిళను గత డిసెంబర్ 30 న చింతాడ వీఆర్వోగా పనిచేస్తున్న అడపాక గౌరీ శంకర్ అనే ఉద్యోగి బొబ్బిలి తాసిల్దార్ కార్యాలయ సమీపంలో అడ్డగించి మహిళ ఒంటిపై చేతులు వేస్తూ, తన శారీరక వాంఛలు తీర్చమని బలవంతంగా వేధించాడని తెలిపింది. బాధితురాలు పోలమ్మ వెంటనే స్థానిక బొబ్బిలి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిపింది. ఈ మేరకు బొబ్బిలి పోలీసులు పోలమ్మ ఫిర్యాదు మేరకు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. కాగా ఇదే కేసు పై విచారణ నిమిత్తం డి.ఎస్.పి శ్రీనివాసరావు విచారణ కూడా చేపట్టారు. అనంతరం డిఎస్పి శ్రీనివాసరావు విచారణ నిమిత్తం ఆమెను అలాగే ఈ కేసులో సాక్ష్యాలుగా ఉన్న పురం వెంకటరమణ తదితర సాక్షులను ఆయన కార్యానికి పిలిపించి తీవ్ర దుర్భాషలాడుతూ కేసును తప్పుదోవ పట్టించే విధంగా వ్యవహరిస్తూ వీడియో తీసాడని పోలమ్మ ఆరోపించింది. అదేవిధంగా డిఎస్పి శ్రీనివాసరావు ఈ కేసులో నిందితుడుగా ఉన్న వీఆర్వో అడపాక గౌరీ శంకర్ ను కేసు నుండి తప్పించేందుకు డీఎస్పీ శ్రీనివాసరావు వ్యవహరించాడని ఆమె ఆరోపించింది. ఈ నేపథ్యంలోనే తాను గత డిసెంబర్ 30 వ తేదీన ఇచ్చిన ఫిర్యాదును తాత్సారం చేసి ఎట్టకేలకు ఈనెల 3వ తేదీన కేసు నమోదు చేశారని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. అయినప్పటికీ నేటి వరకు తనపై అత్యాచార యత్నానికి ప్రయత్నించిన విఆర్ఓ గౌరీ శంకర్ పై ఎటువంటి చట్టపరమైన చర్యలు చేపట్టలేదని ఆమె ఆందోళన వ్యక్తం చేసింది. దళిత మహిళనైన నాపై డిఎస్పి శ్రీనివాసరావు వివక్షత చూపుతున్నారని మండిపడింది. తక్షణమే తనపై అత్యాచార యత్నానికి ప్రయత్నించిన విఆర్ఓ గౌరీ శంకర్ పై అలాగే కేసును తప్పుదోవ పట్టించేందుకు సాక్షులను బెదిరిస్తున్న టీఎస్పీ శ్రీనివాసరావు పై చట్టపరమైన చర్యలు చేపట్టి న్యాయం చేయాలని ఆమె జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ కు ఫిర్యాదు చేసినట్లు సోమవారం అఖిలభారత మానవ హక్కుల సంఘం కార్యాలయానికి బాధితురాలు పోలమ్మ తెలిపింది.

## వాకర్స్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపక అధ్యక్షుడు స్వర్గీయ ఆళ్వార్ దాస్ వర్ధంతి



విజయవాడ, (శుభోదయం న్యూస్): విజయవాడ గులాబి తోట శ్రీ అమరావతి వాకర్స్ క్లబ్ ప్రాంగణం లో గల వాకర్స్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకులు స్వర్గీయ సుంకరి ఆళ్వార్ దాస్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించిన డిస్ట్రిక్ట్ వాకర్స్ గవర్నర్ ఏ విజయలక్ష్మి.ఈ సందర్భముగా ఆమె మాట్లాడుతూ స్వర్గీయ ఆళ్వార్ దాస్ వాకర్స్ ఇంటర్నేషనల్ స్థాపించి ప్రపంచ వ్యాపితంగా అభివృద్ధి చేసి,నడకతోనే ఆరోగ్యం అనే స్ఫూర్తి తో బావి తరాలకు ఆరోగ్యకర బాట వేశారని అన్నారు.మరో అతిథి వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ సెక్రటరీ జనరల్ రంగనాథం మాట్లాడుతూ మరింత బలోపేతం గా వాకర్స్ క్లబ్ లను ఏర్పాటు చేయడం ద్వారా ఆళ్వార్ దాస్ కి అదే ఘన నివాళి అని అన్నారు.ఈ కార్యక్రమం లో డిస్ట్రిక్ట్ వాకర్స్ అదనపు కార్యదర్శి కె యస్ ఆర్ ఆంజనేయులు (రాము).అదనపు కోశాధికారి డాక్టర్ బ్రహ్మదేశం వసంత్ కుమార్.డిప్యూటీ గవర్నర్లు ఎన్ బి జి ఎం ప్రసాద్,ఇమ్మానేని కృష్ణ ప్రసాద్,బండారు వెంకటేశ్వరరావు (కొండా),బోడి ఆంజనేయ రాజు, రామిశెట్టి సుధాకర్, కగ్గా శ్రీనివాస్,కోరంగి మల్లికా,షఫీ ఉల్లా. మాదు వెంకట కృష్ణా రావు, బండారు నాగ వంశీ,తదితరులు పాల్గొన్నారు.

## గుడిపాడు గ్రామంలో మంచినీటి అవస్థలు పరిష్కారం చెయ్యాలని సీపీఎం డిమాండ్



దోర్నాల, మండల రిపోర్టర్ ఆవులయ్య (శుభోదయం న్యూస్ ): ప్రకాశం జిల్లా పెద్ద దోర్నాల మండలంలోని చిన్న గుడిపాడు గ్రామంలో మంచినీటి కోసం గ్రామస్తులు నానా ఇబ్బందులకు గురి అవుతున్నారు. గుడిపాడు గ్రామ సర్పంచ్ గారికి గతంలో చేసిన బిల్లులు ఆపడంతో సర్పంచ్ పట్టించుకోలేదు కానీ టిడిపి వారు బాధ్యత తీసుకుని సర్పంచ్ కి రావాల్సిన నిధులు వారికి వచ్చే విధంగా చూసి ఎస్సీ ఎస్టీ మైనార్టీ ఓసి కులాలు 450 కుటుంబాలు ఉన్నాయి వీరందరూ ఈ సమస్య పరిష్కారం కాకపోతే సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకో ధర్నా నిర్వహిస్తారని కేజీ రోడ్డును దిగ్బంధం చేస్తామని ఈ సమస్యను పరిష్కరించేంతవరకు రోడ్డుపై బాటాయించి సమస్య పరిష్కరించేంతవరకు మండల స్థాయి వరకు దిగ్బంధం చేస్తామని, సంబంధిత అధికారులు వెంటనే ఈ మంచినీటి సమస్యను పరిష్కరించవలసిందిగా పెద్ద దోర్నాల మండల సిపిఎం పార్టీదుగ్గెంపూడి తిరుపతిరెడ్డి మండల సిపిఎం పార్టీ కార్యదర్శి తెలిపారు.

## గొర్రెలమండి ని ప్రారంభించిన కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర



కనిగిరి, రిపోర్టర్ జి ప్రసాదరావు (శుభోదయం న్యూస్): కనిగిరిలో సోమవారం శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి గొర్రెల మండిని ప్రారంభించారు. ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రకాశం జిల్లాలో 20 లక్షల గొర్రెల సంతతి ఉంటే, అందులో ఒక్క కనిగిరి నియోజకవర్గంలోనే 5 లక్షల గొర్రెల, మేకల సంతతి ఉందన్నారు.గొర్రెల పెంపకం దారులకు లబ్ధి చేకూర్చేందుకే కనిగిరిలో గొర్రెల మండిని ఏర్పాటు చేశామని ,గతంలో నేను శాసనసభ్యుడిగా ఉ న్నప్పుడు గొర్రెల మండిని నిర్మిస్తే, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా నాయకులు దానిని పట్టించుకోలేదు.ఈ ప్రాంత గొర్రెల




పెంపకం దారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొనిఈ మండీ ని ప్రారంభించామని,త్వరలో మాంసం ఫ్యాక్టరీని కనిగిరిలో నెలకొల్పేందుకు అన్ని చర్యలు తీసుకుంటా మని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు టిడిపి నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## శివదీక్ష స్వాముల సేవా సమితి ఆధ్వర్యంలో... అన్న సంతర్పణ కార్యక్రమం



దోర్నాల, మండల రిపోర్టర్ ఆవులయ్య (శుభోదయం న్యూస్): ప్రకాశం జిల్లా,పెద్ద దోర్నాలలోని శ్రీ గంగా పార్వతి చెన్న మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో శివదీక్ష స్వాముల సేవా సమితి ఆధ్వర్యంలో పెద్ద దోర్నాల మండల పరిధిలోని శివ దీక్ష మాలాధారణలోనున్న శివ స్వాములకు నేటి నుండి 41 రోజులపాటు అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహించబడుతుందని శివదీక్ష స్వాములు తెలియజేశారు.

## కడప రాజు పల్లె గ్రామంలో గోని గుంట్లనాగేశ్వరరావు కుమార్తె పుష్పాలంకరణ వేడుకలో పాల్గొన్న...... ఎర్రగొండపాలెం నియోజకవర్గం శాసనసభ్యులు తాటిపర్తి చంద్రశేఖర్



దోర్నాల, మండల రిపోర్టర్ ఆవులయ్య (శుభోదయం న్యూస్): ప్రకాశం జిల్లా, దోర్నాల మండలం కడప రాజు పల్లె గ్రామంలో గొనుగుట్ల నాగేశ్వరరావు, కుమార్తె పుష్పాలంకరణ వేడుకలో పాల్గొని ఆశీర్వదించిన ఎర్రగొండపాలెం నియోజకవర్గ శాసనసభ్యులు తాటిపర్తి చంద్రశేఖర్. తదనంతరం ఆ గ్రామంలో వైఎస్ఆర్సిపి పార్టీ కార్యకర్తలను అధ్యక్షులను అందరిని ప్రేమతో పలకరించి వారి బాగోగులు



తెలుసుకున్నారు. అదేవిధంగా ఇటీవల కాలంలో మోకాలు ఆపరేషన్ చేయించుకున్న మేజర్ పంచాయతీ 1 వ వార్డు మెంబర్ రావి క్రింది సుబ్బలక్ష్మమ్మ ను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎర్రగొండపాలెం నియోజకవర్గ శాసనసభ్యులు తాటిపర్తి చంద్రశేఖర రావు, మరియు దోర్నాల మండలం వైఎస్ఆర్సిపి ప్రధాన అధ్యక్షులు, రామిరెడ్డి ,షేక్ మజీద్, గంటా రమణారెడ్డి, మరియు దోర్నాల మండలం వైఎస్ఆర్సిపి కార్యకర్తలు ఒంటేరు వెంకటరమణ, ఒంటేరు నాగేశ్వరరావు, మెట్టెల పుల్లయ్య, దోర్నాల మండల వైఎస్ఆర్సిపి అధ్యక్షులు, కార్యకర్తలు అందరూ పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాలలో చదువుచున్న బాల బాలికలకు బ్యాగులు పంపిణీ



సింగరాయకొండ, మండల రిపోర్టర్ - పసుమర్తి జాలయ్య (శుభోదయం న్యూస్): శానంపూడి గ్రామం అంబేద్కర్ నగర్ నుండి వివిధ గురుకుల పాఠశాలలో చదువుచున్న విద్యార్థిని విద్యార్థులకు ప్రోత్సహించుటకు సింగరాయకొండకు చెందిన షిరిడి క్లాత్ స్టోర్ వారు పోకూరి ప్రసన్న కిరణ్ కుమార్ స్కూల్ బ్యాగులు బహుమతిగా ఇచ్చారు.ఈ కార్యక్రమం ద్వారా ప్రస్తుతం నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులను రానున్న విద్యా సంవత్సరానికి గురుకుల పాఠశాలలో చేరే విధంగా ప్రేరేపించుట కొరకు అని హైకోర్టు న్యాయవాది పంతగాని వెంకటేశ్వర్లు అన్నారు.అదే విధంగా గత 14 సంవత్సరాలనుండి పోకూరి ప్రసన్న కిరణ్ కుమార్ చిన్నారులకు విద్యాపరమైన సహకారం అందిస్తున్నారని, తాము చేస్తున్న పలు సేవా కార్యక్రమాలకు చేదోడు వాదోడుగా ఉంటాడని ఈ సందర్భంగా తెలియజేశారు.ఐదవ తరగతిలోకి బాలికలను రెసిడెన్షియల్ పాఠశాలలో చేర్పించడం వలన తల్లిదండ్రులకు ఆర్థిక భారం తగ్గి,తమ పిల్లలను మధ్యలో బడి మానివేయకుండా డిగ్రీ వరకు చదివిస్తారన్నారు.ప్రభుత్వం విద్యార్థులకు పౌష్టికాహారంతో పాటుగా, క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తారని కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ బల్లెకూర బాలకృష్ణ తెలియజేశారు.కార్యక్రమంలో అంబేద్కర్ యువత పాల్గొన్నారు.

## దామచర్ల జనార్ధన్ పుట్టినరోజు పేదలకు అన్నదానం




ఒంగోలు, (శుభోదయం న్యూస్): ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు జన్మదినోత్సవం సందర్భంగా తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పునుగుపాటి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఒంగోలు సంతపేట లోని శివం శరణాలయం నందు వృద్ధులు అనాధలు పేదల మధ్య కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ పేలప్రోలు బ్రహ్మానందం మాట్లాడుతూ



మన శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ గారి పుట్టినరోజు అనాధలకు యాచకులకు మాంసాహారంతో కూడిన భోజనం ఏర్పాటు చేసి మానవత్వం చాటారని తెలిపారు. తెలుగు యువత నాయకులు యమల బాలకృష్ణ మాట్లాడుతూ ఒంగోలు నగరాన్ని అభివృద్ధి పథంలో నడుపుతున్న మా జనార్ధన అన్నకు హృదయపూర్వక పుట్టినరోజు శుభాకాంక్షలు అని తెలిపారు ఈ సేవ కార్యక్రమంలో శివం ఫౌండేషన్ చైర్మన్ గొల్లపూడి శ్రీహరి మానవతా సేవా సంస్థ అధ్యక్షులు మారెళ్ళ సుబ్బారావు. పైన బోయిన.వెంకటేశ్వర్లు. నల్లబోతు వెంకట రమణమ్మ కొడాలి అంకమ్మ. బత్తుల మాలకొండయ్య దన్నారపు మస్తాన్రావు.చెన్నారెడ్డి రామయ్య చౌదరి

## సూర్యాపేట జిల్లాలో
## గురుకుల పాఠశాల విద్యార్థిని ఆత్మహత్యాయత్నం..

పరిస్థితి విషమం రాష్ట్రంలోని గురుకులాల్లో విద్యార్థుల ఆత్మహత్యల పరంపర కొనసాగుతూనే ఉంది. ప్రభుత్వ నిర్లక్ష్యంతో విద్యార్థుల ప్రాణాలు పిట్టల్లా రాలిపోతున్నాయి. సూర్యాపేట జిల్లాలో గురుకుల పాఠశాల విద్యార్థిని ఆత్మహత్యాయత్నం.. పరిస్థితి విషమంసూర్యాపేట : రాష్ట్రంలోని గురుకులాల్లో విద్యార్థుల ఆత్మహత్యల పరంపర కొనసాగుతూనే ఉంది. ప్రభుత్వ నిర్లక్ష్యంతో విద్యార్థుల ప్రాణాలు పిట్టల్లా రాలిపోతున్నాయి. తాజాగా సూర్యాపేట జిల్లా మద్దిరాలలోని మహాత్మ జ్యోతిబా పూలే తెలంగాణ వెనకబడిన తరగతుల సంక్షేమ బాలికల విద్యాలయంలో ఓ విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. 9 వతరగతి చదువుతున్న విద్యార్థిని వల్లపు హర్షిత హాస్టల్ గదిలో ఉరి వేసుకొని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించింది.గమనించిన ఉపాధ్యాయులు హర్షితను సూర్యాపేటలోని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌కు తరలించారు.పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## కోర్టు తీర్పు పట్ల సంతృప్తి చెందలేదు..



సంజయ్‌కు జైలు శిక్షపై మమతా బెనర్జీ స్పందన దేశవ్యాప్తంగా సంచలనం రేపిన కోల్‌కతాలోని ఆర్జీ కర్ హత్యాచారం కేసులో దోషి సంజయ్ రాయ్‌కు సీబీఐ కోర్టు జీవిత ఖైదు విధించింది. సీఎం మమతా బెనర్జీ దీనిపై స్పందించారు. సంజయ్ రాయ్‌కు కోర్టు విధించిన శిక్ష పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. కోర్టు తీర్పు పట్ల సంతృప్తి చెందలేదు.. సంజయ్‌కు జైలు శిక్షపై మమతా బెనర్జీ స్పందనకోల్‌కతా: దేశవ్యాప్తంగా సంచలనం రేపిన కోల్‌కతాలోని ఆర్జీ కర్ హత్యాచారం కేసులో ( %=+ ఖుతీ తీుజూవ-ఎబతీసవతీ ఝంవ%) దోషి సంజయ్ రాయ్‌కు సీబీఐ కోర్టు జీవిత ఖైదు విధించింది. సీఎం మమతా బెనర్జీ దీనిపై స్పందించారు. సంజయ్ రాయ్‌కు కోర్టు విధించిన శిక్ష పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. సోమవారం మీడియాతో ఆమె మాట్లాడారు. 'నేను సంతృప్తి చెందలేదు. మనమంతా మరణశిక్షను డిమాండ్ చేశాం. కానీ కోర్టు మరణించే వరకు జీవిత ఖైదు విధించింది' అని అన్నారు.కాగా, గత ఏడాది ఆగస్ట్ 9న ఆర్జీ కర్ ఆసుపత్రిలో రాత్రి విధుల్లో ఉన్న జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచారం కేసు దర్యాప్తును కోల్‌కతా పోలీసుల నుంచి బలవంతంగా తీసుకున్నారని మమతా బెనర్జీ ఆరోపించారు. ఒకవేళ కోల్‌కతా పోలీసులు ఈ కేసు దర్యాప్తును కొనసాగించి ఉంటే నిందితుడికి మరణశిక్ష నిర్ధారించేవారని అన్నారు.మరోవైపు సీబీఐ దర్యాప్తును మమతా బెనర్జీ ప్రశ్నించారు. 'వారు (సీబీఐ) దర్యాప్తు ఎలా నిర్వహించారో మాకు తెలియదు. రాష్ట్ర పోలీసులు దర్యాప్తు చేసిన ఇలాంటి అనేక కేసుల్లో మరణశిక్ష విధించారు. ఈ శిక్ష పట్ల నేను సంతృప్తి చెందలేదు. మరణశిక్షను డిమాండ్ చేస్తున్నాం. మాకు న్యాయం కావాలి' అని అన్నారు.

## మెరికాలో హైదరాబాద్ యువకుడిపై కాల్పులు




అమెరికాలో హైదరాబాద్ యువకుడిపై దుండగులు కాల్పులకు పాల్పడ్డారు. అమెరికాలో హైదరాబాద్ యువకుడిపై కాల్పులు హైదరాబాద్ : అమెరికాలో హైదరాబాద్ యువకుడిపై దుండగులు కాల్పులకు పాల్పడ్డారు. ఈ ఘటనలో చైతన్యపురికి చెందిన రవితేజ మృతి చెందాడు. అతని మరణ వార్త విని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మాస్టర్స్ చదివేందుకు 2022లో రవితేజ అమెరికా వెళ్లినట్లు సమాచారం.

## ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వృద్ధిరేటులో కోత..
## ఏడు శాతానికే పరిమితం అంటున్న మూడీ'స్..!




ప్రముఖ రేటింగ్ సంస్థ మూడీ'స్ ( భారత్ వృద్ధిరేటు అంచనాలను తగ్గించేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో వృద్ధిరేటు ఏడు శాతమేనని తేల్చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వృద్ధిరేటులో కోత.. ఏడు శాతానికే పరిమితం అంటున్న మూడీ'స్..!ప్రముఖ రేటింగ్ సంస్థ మూడీ'స్ (%వీశీశీసఎ%'%ం%) భారత్ వృద్ధిరేటు అంచనాలను తగ్గించేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో వృద్ధిరేటు ఏడు శాతమేనని తేల్చేసింది. గత ఆర్థిక సంవత్సరం (2023-24) వృద్ధిరేటు 8.2శాతంతో పోలిస్తే తగ్గుముఖం పడుతుందని వ్యాఖ్యానించింది. జాతీయ, అంతర్జాతీయ ఆర్థిక ధోరణుల నేపథ్యంలో వృద్ధిరేటు అంచనాలు తగ్గిస్తున్నట్లు మూడీ'స్ పేర్కొంది. అలాగే, దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధిరేటు కొనసాగుతుందని వెల్లడించింది. 2023-24తో పోలిస్తే తలసరి ఆదాయం 10,233 డాలర్లతో 11 శాతం పెరిగింది.ఇంతకు ముందు ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫిక్కీ) సైతం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం వృద్ధి రేటు 7 నుంచి 6.4 శాతానికి పరిమితం అవుతుందని అంచనా వేసిన సంగతి తెలిసిందే. 2023-24లో జీడీపీ 8.2 శాతంగా నిలిచింది. అంటే గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది వృద్ధిరేటు గణనీయంగా పతనమైంది.గత డిసెంబర్‌లో ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఏడీబీ) సైతం భారత్ వృద్ధిరేట్ అంచనాలను సవరించింది. 2023-24లో భారత్ వృద్ధిరేటు 6.5 శాతమేనని ఏడీబీ పేర్కొంది. పారిశ్రామిక వృద్ధి బలహీనం, ప్రభుత్వ వ్యయం తగ్గింపు దీనికి కారణం అని వెల్లడించింది. ఇండ్ల డిమాండ్‌పై కఠిన ద్రవ్య పరపతి విధానంతో 2025-26లో జీడీపీ 7.2 నుంచి ఏడు శాతానికి పరిమితం అవుతుందని తెలిపింది.

## లాభాల్లో ముగిసిన దేశీయ స్టాక్ మార్కెట్లు..
## సెనెక్స్ 454 పాయింట్లు జంప్



దేశీయ స్టాక్ మార్కెట్లు (సోమవారం లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లలోని సానుకూల పవనాలతో మార్కెట్లు లాభాలపడ్డాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 76,978.53 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. ప్రారంభంలోనే సెన్సెక్స్ 300 పాయింట్లకుపైగా పెరిగింది. చివరి వరకు అదే ఊపును కొనసాగించాయి. లాభాల్లో ముగిసిన దేశీయ స్టాక్ మార్కెట్లు.. సెనెక్స్ 454 పాయింట్లు జంప్‌దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లలోని సానుకూల పవనాలతో మార్కెట్లు లాభపడ్డాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 76,978.53 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. ప్రారంభంలోనే సెన్సెక్స్ 300 పాయింట్లకుపైగా పెరిగింది. చివరి వరకు అదే ఊపును కొనసాగించాయి. ఇంట్రాడేలో 76,584.84 పాయింట్ల కనిష్ఠాన్ని తాకిన సెన్సెక్స్.. 77,318.94 పాయింట్ల గరిష్ఠానికి చేరింది. చివరకు 454.11 పాయింట్ల లాభంతో.. 77,073.44 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 141.55 పెరిగి.. 23,344.75 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో దాదాపు 2,399 షేర్లు లాభపడ్డాయి.మరో 1,492 షేర్లు నష్టపోయాయి. నిఫ్టీలో కోటక్ మహీంద్రా బ్యాంక్, విప్రో, బజాజ్ ఫైనాన్స్, ఎన్‌టీపీసీ, బజాజ్ ఫిన్‌సర్వ్ లాభపడ్డాయి. ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, శ్రీరామ్ ఫైనాన్స్, ట్రెంట్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, అదానీ పోర్ట్స్ నష్టపోయాయి. ఆటో, ఎఫ్‌ఎంసీజీ మినహా ఇతర అన్ని సూచీలు బ్యాంక్, మీడియా, మెటల్, క్యాపిటల్ గూడ్స్, పీఎస్‌యూ, టెలికాం, పవర్, పీఎస్‌యూ బ్యాంక్ ఒకటి నుంచి రెండుశాతం వరకు పెరిగాయి. బీఎస్‌ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.66 శాతం పెరిగింది. స్మాల్ క్యాప్ ఇండెక్స్ దాదాపు ఒకశాతం పైకి కదిలింది.

## కుమారుడు ఆత్మహత్య.. తట్టుకోలేక గుండెపోటుతో తల్లి మృతి

ఉద్యోగం రాలేదన్న మనస్తాపంతో ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయం తెలిసి అతడి తల్లి గుండెపోటుతో మరణించింది. తల్లి, కుమారుడు మరణించిన సమాచారం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కుమారుడు ఆత్మహత్య.. తట్టుకోలేక గుండెపోటుతో తల్లి మృతిభోపాల్: ఉద్యోగం రాలేదన్న మనస్తాపంతో ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయం తెలిసి అతడి తల్లి గుండెపోటుతో మరణించింది. తల్లి, కుమారుడు మరణించిన సమాచారం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. (%ాశీఅ ాబఱఎఱఅవ, వీశీష్ట్రవతీ ణఱవం ాఖీ ఎఖుతీ ాఖఎఎ%) మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో ఈ సంఘటన జరిగింది. 33 ఏళ్ల మనీష్ రాజ్‌పుత్ ప్రభుత్వ ఉద్యోగాల కోసం చాలా పరీక్షలు రాశాడు. ఏ ఉద్యోగం రాకపోవడంతో తీవ్ర మనస్తాపం చెందాడు. ఈ నేపథ్యంలో జనవరి 18న శనివారం రాత్రి వేళ ఇంట్లో విషం సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు మనీష్‌ను వెంటనే ఆసుపత్రికి తరలించారు.కాగా, మనీష్ చికిత్స పొందుతూ ఆదివారం మరణించాడు. అయితే కుమారుడి మరణవార్త తెలిసి అతడి తల్లి రాధా గుండెపోటుతో కుప్పకూలి చనిపోయింది. ఈ నేపథ్యంలో ఆ కుటుంబంలో విషాదం నెలకొన్నది. రాధా పెద్ద కుమారుడు అనిల్ ఈ విషయాన్ని పోలీసులకు తెలిపాడు. దీంతో వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వాముని తింటే
## ఎన్ని లాభాలు కలుగుతాయో తెలుసా..? ఆశ్చర్యపోతారు..!



మన వంటి ఇంటి పోపు దినుసుల జాబితా చూస్తే అందులో మనం వాడే దినుసులు చాలానే ఉంటాయి. వాటిల్లో వాము కూడా ఒకటి. వామును మనం తరచూ పోపు దినుసులుగా ఉపయోగిస్తుంటాం. మన వంటి ఇంటి పోపు దినుసుల జాబితా చూస్తే అందులో మనం వాడే దినుసులు చాలానే ఉంటాయి. వాటిల్లో వాము కూడా ఒకటి. వామును మనం తరచూ పోపు దినుసులుగా ఉపయోగిస్తుంటాం. అయితే ఆయుర్వేద పరంగా చూస్తే వాము మనకు ఎన్నో ప్రయోజనాలను అందిస్తుంది. వామును తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. వాములో ఎన్నో ఔషధ గుణాలు ఉంటాయని ఆయుర్వేద వైద్య నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలోనే పలు రకాల అనారోగ్య సమస్యలకు, వ్యాధులకు వాము చక్కని ఔషధంగా పని చేస్తుందని వారు అంటున్నారు. వాము రుచి ఘాటుగా ఉంటుంది. అందుకని దాన్ని నేరుగా తినలేని వారు కాస్త ఉప్పు చల్లి తినవచ్చు. అలా తిన్న వెంటనే ఒక గ్లాస్ గోరు వెచ్చని నీటిని తాగాలి. ఇలా వామును తింటే ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని అంటున్నారు

### రోగ నిరోధక వ్యవస్థకు..

వామును నమలడం వల్ల నోట్లోని బ్యాక్టీరియా నశిస్తుంది. దీంతో చిగుళ్ల వాపులు తగ్గుతాయి. దంతాల నొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది. నోటి దుర్వాసన తగ్గుతుంది. నోట్లో ఉండే ఇన్‌ఫెక్షన్లు తగ్గుతాయి. నోరు, దంతాలు, చిగుళ్లు ఆరోగ్యంగా ఉంటాయి. వాములో థైమోన్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది యాంటీ మైక్రోబియల్ లక్షణాలను కలిగి ఉంటుంది. అందువల్ల వామును తింటే బ్యాక్టీరియా, ఫంగస్ ఇన్‌ఫెక్షన్లు తగ్గుతాయి. రోగ నిరోధక వ్యవస్థ పటిష్టంగా మారుతుంది. వ్యాధులకు వ్యతిరేకంగా శరీరం పోరాడే శక్తి లభిస్తుంది. రోజూ వామును తినడం వల్ల శరీర మెటబాలిజం పెరుగుతుంది. దీంతో క్యాలరీలు వేగంగా ఖర్చవుతాయి. ఫలితంగా కొవ్వు కరుగుతుంది. దీంతో అధిక బరువు తగ్గుతారు. బరువు నియంత్రణలో ఉండాలనుకునే వారు వామును రోజూ తింటే ఫలితం ఉంటుంది.

### కడుపు నొప్పి..

వాములో యాంటీ స్పాస్మోడిక్ గుణాలు ఉంటాయి. అందువల్ల కడుపు నొప్పికి వాము దివ్యౌషధంగా పనిచేస్తుంది. ఇది అన్ని రకాల కడుపు నొప్పులను తగ్గిస్తుంది. స్త్రీలకు రుతు సమయంలో వచ్చే కడుపు నొప్పి సైతం తగ్గిపోతుంది. అలాగే అజీర్ణం వల్ల వచ్చే నొప్పిని సైతం వాము తగ్గిస్తుంది. కనుక వామును తింటే ఆయా సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. అలాగే వాములో ఉండే థైమోల్ అనే సమ్మేళనం ముక్కు రంధ్రాలను క్లియర్ చేస్తుంది. దీని వల్ల ముక్కు దిబ్బడ నుంచి ఉపశమనం లభిస్తుంది. ఆస్తమా, బ్రాంకైటిస్, జలుబు ఉన్నవారికి ఎంతగానో మేలు చేస్తుంది. వామును పొడి చేసి ఒక వస్త్రంలో చుట్టి వాసన పీలుస్తుంటే ఆయా సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది.

### జీర్ణ వ్యవస్థకు..


వామును తినడం వల్ల పొట్లో ఆమ్లాలు తటస్థీకరించబడతాయి. దీంతో గుండెల్లో మంట, అసిడిటీ నుంచి ఉపశమనం లభిస్తుంది. జీర్ణవ్యవస్థలో ఉండే అసౌకర్యం తొలగిపోతుంది. గ్యాస్ నుంచి ఉపశమనం లభిస్తుంది. అలాగే వామును తినడం వల్ల జీర్ణాశయంలో పలు ఎంజైమ్‌ల ఉత్పత్తి పెరుగుతుంది. దీంతో కడుపు ఉబ్బరం నుంచి ఉపశమనం లభిస్తుంది. పొట్టలో గ్యాస్ ఏర్పడకుండా చూసుకోవచ్చు. అజీర్ణం తగ్గిపోతుంది. తిన్న ఆహారం సరిగ్గా జీర్ణమవుతుంది. జీర్ణ వ్యవస్థ మెరుగ్గా పనిచేస్తుంది. ఈ సమస్యలు రాకుండా ఉండాలంటే భోజనం చేసిన అనంతరం వామును తినాలి. దీంతో ఎంతగానో ఉపశమనం లభిస్తుంది. ఇలా వామును తినడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు.

## చిరుత పులి దాడిలో బర్రె మృతి..
## అప్రమత్తమైన అటవీ శాఖ అధికారులు



రాజన్న సిరిసిల్ల జిల్లాలో చిరుత పులి కలకలం సృష్టిస్తోంది. ఓ బర్రెపై చిరుత దాడి చేసి చంపింది. చిరుత పులి దాడిలో బర్రె మృతి.. అప్రమత్తమైన అటవీ శాఖ అధికారులురాజన్న సిరిసిల్ల : రాజన్న సిరిసిల్ల జిల్లాలో చిరుత పులి కలకలం సృష్టిస్తోంది. ఓ బర్రెపై చిరుత దాడి చేసి చంపింది. చిరుత సంచారంతో స్థానిక రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.వివరాల్లోకి వెళ్తే.. గంభీరావుపేట మండల పరిధిలోని ముస్తాఫానగర్ గ్రామ శివారులో రాసమల్ల రాజు అనే రైతుకు వ్యవసాయ పొలం ఉంది. అయితే పొలంలోనే పశువుల కోసం ఓ షెడ్‌ను నిర్మించాడు. అందులో బర్రెను కట్టేసి ఆదివారం రాత్రి ఇంటికి వచ్చాడు. ఇక సోమవారం తెల్లవారుజామున పొలం వద్దకు వెళ్లి చూడగా, బర్రె రక్తపు మడుగులో పడి ఉంది.ఆందోళనకు గురైన రాజు.. గ్రామస్తులను అప్రమత్తం చేశాడు. ఇక అతని పొలంలో పులి పాదముద్రలను గుర్తించారు. దీంతో అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. పులి పాదముద్రలను అధికారులు నిర్ధారించారు. అనంతరం రైతులను, స్థానికులను అధికారులు అప్రమత్తం చేశారు. చిరుత కదలికలపై రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

## మరోసారి ఐకానిక్ స్టెప్పులతో ఆకట్టుకున్న ట్రంప్..



'మేక్ అమెరికా గ్రేట్ అగైన్' పేరుతో నిర్వహించిన ర్యాలీలో ట్రంప్ మరోసారి తన ఐకానిక్ స్టెప్పులతో ఆకట్టుకున్నారు. మరోసారి ఐకానిక్ స్టెప్పులతో ఆకట్టుకున్న ట్రంప్.. మరికొన్ని గంటల్లో అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ంండోసారి బాధ్యతలు చేపట్టబోతున్నారు. ఈ నేపథ్యంలో ప్రమాణ స్వీకారోత్సవానికి ముందు ట్రంప్ విక్టరీ ర్యాలీ నిర్వహించారు. వాషింగ్టన్ డీసీలో ఆదివారం నిర్వహించిన ఈ ర్యాలీలో ట్రంప్ మద్దతుదారులు, స్నేహితులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.'మేక్ అమెరికా గ్రేట్ అగైన్' పేరుతో నిర్వహించిన ఈ ర్యాలీలో ట్రంప్ మరోసారి తన ఐకానిక్ స్టెప్పులతో ఆకట్టుకున్నారు. ర్యాలీ ముగింపు సందర్భంగా విలేజ్ డిస్కో గ్రూప్ ప్రత్యేక ప్రదర్శన ఇచ్చింది. స్టేజ్‌పై పాట పాడుతూ ఉర్రూతలూగించింది. అదే సమయంలో స్టేజ్‌పై ఉన్న ట్రంప్.. మ్యూజిక్‌కు తగ్గట్లుగా తన ఐకానిక్ స్టెప్పులతో మద్దతుదారులను ఉత్సాహపరిచారు. ఇందుకు సంబంధించిన

## ఫ్లెక్స్ ఫ్యుయల్ వర్షన్ క్రెటా..
## ఆవిష్కరించిన హ్యుండాయ్.. ఇవీ డిటెయిల్స్..!




దక్షిణ కొరియా ఆటో మేజర్ హ్యుండాయ్ మోటార్ ఇండియా సోమవారం ఢిల్లీలో జరుగుతున్న భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పోలో ప్రోటోటైఫ్ ఫ్లెక్స్ ఫ్యుయల్ క్రెటా వర్షన్ ఆవిష్కరించింది. ప్రముఖ దక్షిణ కొరియా ఆటోమొబైల్ దిగ్గజం హ్యుండాయ్.. దేశీయ మార్కెట్లో ఫ్లెక్స్ ఫ్యుయల్ కారు తెచ్చేందుకు సన్నాహాలు చేస్తోంది. దేశ రాజధాని ఢిల్లీలో జరుగుతున్న భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో - 2025 2025)లో సోమవారం హ్యుండాయ్ మోటార్ ఇండియా ఎండీ యున్‌సూకిమ్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ కం హోల్‌టైం డైరెక్టర్ తరుణ్ గార్గ్ ప్రొటోటైప్ హ్యుండాయ్ క్రెటా ఫ్లెక్స్ ఫ్యుయల్ కారును ఆవిష్కరించారు. కారు 100శాతం పెట్రోల్ (ఈ0), వందశాతం ఇథనాల్ (ఈ100)లతో పని చేస్తుంది. కర్బన ఉద్గారాల తగ్గింపుతోపాటు మెరుగైన పవర్, టార్క్ డెలివరీని బలోపేతం చేస్తాయి ఇథనాల్ పవర్డ్ వెహికల్స్. ప్రభుత్వ ఇన్సెంటివ్‌ల సాయంతో ఫ్లెక్స్ ఫ్యుయల్ కార్ల ధరలు తగ్గుముఖం పడతాయి. ప్రస్తుతం హ్యుండాయ్ క్రెటా కారు పెట్రోల్, టర్బో-పెట్రోల్, డీజిల్, ఎలక్ట్రిక్ ఆప్షన్లలో అందుబాటులో ఉంటుంది. భారత్ మొబిలిటీ ఎక్స్ పో 2025లోనే హ్యుండాయ్ తన క్రెటా ఎలక్ట్రిక్ కారు ఆవిష్కరించింది. దీని ధర రూ.17.99 లక్షలు (ఎక్స్ షోరూమ్) పలుకుతుంది.క్రెటా ఎలక్ట్రిక్ రెండు బ్యాటరీ ఆప్షన్లు 42 కిలోవాట్ల బ్యాటరీ ప్యాక్‌తో 99కిలోవాట్ల మోటార్‌తో వస్తోంది. ఈ బ్యాటరీ సింగిల్ చార్జింగ్‌తో 390 కి.మీ దూరం ప్రయాణిస్తుంది. ఇక 51.4కిలోవాట్ల బ్యాటరీ ప్యాక్‌తో 126కిలోవాట్ల మోటార్‌తో వస్తున్నది. సింగిల్ చార్జింగ్‌తో 473 కి.మీ దూరం ప్రయాణిస్తుంది. టాప్ వేరియంట్ కేవలం 7.9 సెకన్లలో 100 కి.మీ వేగం అందుకుంటుంది.హ్యుండాయ్ (ఐసీఈ) క్రెటా కారు మూడు ఇంజిన్ ఆప్షన్లలో లభిస్తుంది. 1.5- లీటర్ల పెట్రోల్ ఇంజిన్ (113బీహెచ్‌పీ, 144 ఎన్‌ఎం టార్క్), 1.5-లీటర్ల డీజిల్ ఇంజిన్ (114బీహెచ్‌పీ, 250 ఎన్‌ఎం టార్క్),1.5-లీటర్ల టర్బో పెట్రోల్ ఇంజిన్ (158బీహెచ్‌పీ, 253 ఎన్‌ఎం టార్క్) వెలువరిస్తుంది. ఈ కారు పెట్రోల్ ఇంజిన్ వేరియంట్ 6-స్పీడ్ మాన్యువల్, సీవీటీ ట్రాన్స్‌మిషన్, డీజిల్ వేరియంట్ 6-స్పీడ్ టార్క్ కన్వర్టర్, టర్బో పెట్రోల్ వేరియంట్ 7- స్పీడ్ డీసీటీ కన్వర్టర్ ట్రాన్స్‌మిషన్ ఆప్షన్లలో అందుబాటులో ఉంటుంది.

## ప్రపంచ రికార్డు సృష్టించిన
## ఇండియన్ ఆర్మీకి చెందిన డేర్‌డెవిల్స్ టీమ్

ఈ నెల 26న జరిగే 76వ గణతంత్ర దినోత్సవాలకుదేశ రాజధాని నగరంలోని కర్తవ్యపథ్



ముస్తాబవుతోంది. ఈ వేడుకలకు విదేశీ ప్రముఖులతోపాటు పారాలింపిక్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు, ఉత్తమ పని తీరు కనబరచిన గ్రామాల సర్పంచ్‌లు, చేనేత కళాకారులు, అటవీ, వన్య ప్రాణి సంరక్షకులు ఇలా దాదాపు 10,000 మంది ప్రత్యేక అతిథులను కేంద్రం ఆహ్వానించింది. ఇక గణతంత్ర వేడుకల్లో భాగంగా భారత ఆర్మీ ఇప్పటికే పలు విన్యాసాలు చేస్తోంది. ఈ క్రమంలో భారత ఆర్మీ కి చెందిన డేర్‌డెవిల్స్ టీమ్ సరికొత్త రికార్డు సృష్టించింది.కదులుతున్న బైక్స్‌పై అత్యంత ఎత్తైన మానవ పిరమిడ్ (20.4 అడుగులు)ను ( నిర్మించి ప్రపంచ రికార్డు సృష్టించింది. తద్వారా అసాధారణమైన ఫీట్‌ను సాధించింది. ఏడు మోటార్ సైకిళ్లపై 40 మంది 2 కిలోమీటర్ల మేర ప్రయాణించడం ద్వారా ఈ ఘనతను అందుకుంది. ఆర్మీలోని మోటార్ సైకిల్ రైడర్ డిస్‌ప్లే టీమ్‌ను 'డేర్ డెవిల్స్' అని పిలుస్తారు. ఈ టీమ్‌కు సుదీర్ఘ చరిత్ర ఉంది. అంతేకాదు.. తమ ప్రదర్శనలతో అంతర్జాతీయ ప్రశంసలు కూడా అందుకుంది. ఈ టీమ్ ఇప్పటికే ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్, లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ సహా 33 ప్రపంచ రికార్డులను సొంతం చేసుకుంది. 1935 నుంచి ఇప్పటి వరకూ డేర్‌డెవిల్స్ టీమ్.. గణతంత్ర దినోత్సవ పరేడ్‌లు, ఆర్మీ డే పరేడ్‌లు సహా ప్రతిష్టాత్మక కార్యక్రమాల్లో దాదాపు 1,600 మోటార్ సైకిల్స్ ప్రదర్శనలు ఇచ్చి ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది.

## కందుకూరు రవాణా శాఖ కార్యాలయం లో నిర్వహించిన
## జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు




**కందుకూరు, అర్సీ ఇంచార్జ్ - శ్రీకాంత్ (శుభోదయం న్యూస్): 2025 లో భాగంగా కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ 36 వ జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల బ్యానర్ ను సోమవారం కందుకూరు రోడ్డు రవాణా శాఖ కార్యాలయంలో ఆవిష్కరించినారు. ఈ సందర్భంగా కందుకూరు ఆర్టీవో టీ వీ ఎన్ లక్ష్మీ మాట్లాడుతూ 2025 సంవత్సర రహదారి భద్రత మాసోత్సవాల స్లోగన్ ను "రహదారి భద్రత ప్రచారం- శ్రద్ధ వహించండి" గా కేంద్ర ప్రభుత్వం వారు నామకరణం చేయటం జరిగిందని.ఈ యొక్క రహదారి భద్రత మహోత్సవాలు జనవరి 16.2025 నుండి ఫిబ్రవరి 15.2025 వరకు జరుగుతాయని .తెలియజేశారు. అనంతరం ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి మరియు కందుకూరు పరిధిలో ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రదేశాలు గుర్తించి తగు నివారణ చర్యలు కొరకు చర్చించడం జరిగింది.ఈ కార్యక్రమంలో కందుకూరు డిఎస్పి సిహెచ్ వి.బాలసుబ్రమణ్యం మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్ సిహెచ్ రాంబాబు కందుకూరు సిఐ కె వెంకటేశ్వర్లు కావాలి అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ బి లక్ష్మీబాయి కందుకూరు టౌన్ ఎస్ఐ వి.సాంబశివరావు రూరల్ ఎస్సై బీబీ మహేంద్ర మరియు మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.**

శుభోదయం

సంపాదకీయం

# బహుజనులు రాజకీయ బానిసలేనా!

## (విశ్లేషణ)

భారతావనికి స్వాతంత్ర్యం వచ్చి 76 ఏళ్లు గడిచినా ఎన్నో విషయాలలో మార్పు కానరాకుండానే ఉంది. కాలంతో పాటు శాస్త్ర, సాంకేతికపరమైన అంశాలలో అనేక వినూత్నమైన సంస్కరణలు జరుగుతున్నాయి. కానీ జనాభాలో దిక్సూచిగా, అనేక కులవృత్తులకు పునాదిగా, అన్ని వర్గాలను ఆదరించే జనక్షేత్రమైన బహుజనుల జీవితాలలో మాత్రం ఎలాంటి నూతన మార్పులు చోటుచేసుకోవడంలేదు. తరాలు మారుతున్నా బహుజన జాతుల తలరాతల్లో మాత్రం ఎలాంటి కొత్త సంస్కరణలకు బీజం పడటం లేదు. వందల సంవత్సరాల క్రితం నుండి వంశపారంపర్యంగా వస్తున్న కులవృత్తులనే నమ్ముకుని తమ జీవితాలను వెళ్లబుచ్చుతున్నారు. బహుజనుల జాతులు ఎన్నో సంవత్సరాలుగా సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా చతికలపడి సతమతమవుతున్న విషయం గ్రహించిన పాలక పక్షాలు నిమ్మకునీరెత్తినట్లు ఉంటున్నాయి. దాదాపు 300 సంవత్సరాల క్రితమే బహుజన కులాలు అగ్రవర్ణాల ఆగడాలకు, అఘాయిత్యాలకు ఆగమవుతుంటే అందరినీ ఏకతాటిపై సంఘటితం చేసి భూస్వాముల, పెత్తందారుల అధిపత్యాన్నీ బద్దలుకొట్టి, నిజాం పాలకుల గుండెల్లో రైలు పరిగెత్తించిన సర్వాయిపాపన్న గౌడ్ ఆత్మవిశ్వాసం, బహుజనుల బతుకుల్లో మార్పుకై యుద్ధం చేసిన వీరుడు బత్తిని మొగిలయ్యగౌడ ధీరత్వం ఇలా ఎంతో మంది బహుజనయోధుల చరిత్రలు ఉన్న ఈ అణగారిన వర్గాలకు ఐక్యత రాకుండానే ఉంది. దీనికి కారణం ఎవరూ అనేది అంతుచిక్కని ప్రశ్నగానే మిగులుతుంది! బహుజన జాతి అంటే గౌడ, మంగళి, కుమ్మరి, కమ్మరి, ముదిరాజులు, రజకులు ఇలా చెప్పుకుంటే దాదాపు వందకు పైగా కులాల క్షేత్రం. కులవృత్తిలో తమ బతుకుదెరువును వెతుక్కుంటూ జీవనాన్ని కొనసాగిస్తున్న నిరుపేదల సమూహం. జ్యోతిరావు పూలే, పెరియార్ ఇలా ఎంతో మంది మేధావులు, విజ్ఞావంతులు ఎన్నో సామాజిక, సిద్ధాంతపరమైన పోరాటాలు చేసిన బహుజనుల బతుకుల్లో వెలుగులు పూర్తి స్థాయిలో రాలేదు. జనాభాలో 25 శాతానికి పైగా ఉన్న బహుజనుల ఉనికి ఏ చోట పూర్తి స్థాయిలో ఉండకపోవడం చాలా బాధాకరం. కేవలం ఓట్ల, సీట్ల ప్రాతిపదికనే బహుజన వర్గాలను బానిసలుగా మార్చి అవసరానికి వాడుకొని అగ్రవర్ణాలు తమ ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్నారు. ఎన్నికల వేళ వందల హామీలు ఇస్తూ బహుజన జాతుల మద్దతును కూడగట్టుకొని ఆ తర్వాత హామీల ఆచూకీ లేకుండా చేస్తున్నారు. బహుజనులను కేవలం అగ్రవర్ణాల ఆధిపత్యానికి బాటలు వేసే ఓట్ల బానిసలుగా చూస్తున్నారే తప్ప వారి తరాల ఉన్నతికి, సంక్షేమానికై ఎవరూ ప్రణాళికలు చేయడం లేదు. బహుజనుల ఒక్కో కులానికి ఒక్కో కులసంఘం ఉంది. అవన్నీ ఏకతాటిపైకి వచ్చి సమష్టి కృషితో పోరాటాలు చేస్తేనే బహుజనుల్లో మార్పు తథ్యమని బిసి మేధావుల అభిప్రాయం. అగ్రవర్ణాలు తమ రాజకీయ భవిష్యత్తుకు బిసిలను బలగాలుగా చూస్తున్నారు. ఆ బలగాలు రాజ్యాధికార బావుటాను ఎగరవేయడంలో సన్నద్ధం కావాల్సిన అవసరం ఉందని బహుజన విజ్ఞానవంతులు ఆలోచన. అగ్రవర్ణాలు ఉన్నతమైన శాసించే పదవుల్లో ఉంటూ బిసిలను ఆశించే క్రింది స్థాయి పదవులకే పరిమితం చేసి అవమానపరుస్తూ, మనోవేదనకు గురిచేసే మాటలు మాట్లాడుతున్నా తీరు నేటి పరిస్థితుల్లో మనందరం చూస్తూనే ఉన్నాం. ఇప్పటికే స్వార్థపూరితమైన ఆలోచనాలకు స్వస్తి పలికి, నిస్వార్థంగా అన్ని సంఘాలు సమష్టిగా శ్రమిస్తే బహుజచనాలకు స్వస్తి పలికి, నిస్వార్థంగా అన్ని సంఘాలు సమష్టిగా శ్రమిస్తేన రాజ్యాధికారం సాధించే దిశగా అడుగులు వేయవచ్చని పలు సంఘాలు కోరుకుంటున్నాయి. ప్రలోభాలకు, మోసపూరిత మాటలకు బానిసలు కాకుండా భవిష్యత్ బిసి తరాల ఉన్నతికై ఆలోచనాలు చేయాల్సిన అవసరం ఉంది. కనుమరుగు అవుతున్న బహుజన జాతుల కులవృత్తుల పరిరక్షణకై సమగ్రమైన, పటిష్టమైన సంస్కరణలు చేసేలా పోరాటలు చేయాల్సి ఉంది. చట్టసభల్లో కూడా బహుజనులకై సముచిత స్థానం కల్పించే దిశగా నూతన సంస్కరణలు చేయాల్సిన అవసరం ఉంది.

## గజ గజ.. వరుస మరణాలతో స్మశానంగా మారుతున్న గ్రామం..

# వామ్మో.. ఏం జరుగుతోంది...



ప్రకృతి అందాలకు నెలవైన జమ్ము-కాశ్మీర్‌లో ఓ గ్రామం ఇప్పుడు అంతుచిక్కని మరణాలతో కలకలం రేపుతోంది. కేవలం 45 రోజుల వ్యవధిలో 17 మంది ప్రాణాలను అంతుచిక్కని రుగ్మత బలితీసుకుంది. ఇంకా చాలా మంది ప్రాణాపాయ స్థితిలో జమ్ములోని ఆస్పత్రిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఈ మరణాల మిస్టరీ తేల్చేందుకు కేంద్ర హోంశాఖ వివిధ మంత్రిత్వ శాఖలతో కలిపి ఒక బృందాన్ని రాష్ట్రానికి పంపించింది. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం సైతం ఆరోగ్య శాఖ, పోలీసు శాఖలతో విచారణ జరిపిస్తోంది. జమ్ము కాశ్మీర్ రాష్ట్రంలోని రాజౌరీ జిల్లాలో బుధాల్ గ్రామం ఈ అంతుచిక్కని మరణాలకు నిలయంగా మారింది.

### ఎలా మొదలైంది?

గత ఏడాది (2024) డిసెంబర్ 7న ఈ మరణ మృదంగం మోగింది. సామూహిక భోజనాల్లో ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురు తీవ్ర అస్వస్థతకు గురవగా, వారిలో ఏకంగా ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. ఆ తర్వాత డిసెంబర్ 12న ఒకే కుటుంబానికి చెందిన 9 మంది అస్వస్థతకు గురికాగా, ముగ్గురు ప్రాణాలు విడిచారు. మూడవ ఘటన జనవరి 12న నమోదైంది. ఒక కుటుంబానికి చెందిన 10 మంది సామూహిక భోజనాల్లో అస్వస్థతకు గురయ్యారు. వారిలో ఆరుగురు చిన్నారులు జమ్ములోని SMGS ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా.. గురువారం పదేళ్ల జబీనా కౌసర్ చనిపోయింది. ఆమె సోదరి 15 ఏళ్ల యస్మీన్ కౌసర్ చికిత్స పొందుతూ ఆదివారం ప్రాణాలు విడిచింది. ఈ మరణంతో మొత్తం మృతుల సంఖ్య 17కు చేరింది.

### విచారణలో ఏమైనా తేలిందా?

వరుసగా నమోదవుతున్న మిస్టరీ మరణాలపై వైద్యారోగ్య శాఖకు చెందిన అధికారులు విచారణ చేపట్టారు. గ్రామంలోని 3,000 మందిని ఇంటింటికీ వెళ్లి సర్వే చేశారు. అక్కడ నీరు, ఆహారం సహా వివిధ రకాల శాంపిళ్లను సేకరించి ల్యాబ్ టెస్టులకు పంపించారు. ఇన్‌ఫ్లూయెంజా తరహా ఆనవాళ్లు లేదా నీరు, ఆహారం కలుషితమైన దాఖలాలేవీ ఆ టెస్ట్ రిపోర్టుల్లో కనిపించలేదు. దాంతో మరింత అడ్వాన్స్‌డ్ పరీక్షల కోసం ప్రఖ్యాత జాతీయ సంస్థలు ICMR నేషన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ , నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ , CSIR, DRDO, PGIMER-చండీగఢ్ వంటి సంస్థలు రంగంలోకి దిగి నిర్వహించిన పరీక్షల్లోనూ అనుమానించదగ్గ ఆనవాళ్లు ఏవీ లభించలేదు. మరణాలకు దారితీసిన కారణాలు కూడా తెలియలేదు. చనిపోయినవారంతా 1.5 కి.మీ పరిధిలో నివసించే 3 కుటుంబాలకు చెందినవారని పోలీసుల విచారణలో తేలింది. అంతకు మించి మరణాల వెనుక కారణమేంటి అన్నది పోలీసుల కోణంలోనూ ఎలాంటి ఆధారం లభించలేదు. అయితే మొదటి మరణం సంభవించినప్పటి నుంచి గ్రామంలో వైద్య సిబ్బంది అంబులెన్సులతో పాటు అందుబాటులో ఉన్నారు. చనిపోయిన 3 కుటుంబాలకు చెందిన ఇళ్లకు తాళాలు వేశారు. వారితో బంధుత్వాలు, సంబంధాలు కలిగిన 21 మందిని ప్రభుత్వ వసతి గృహాలకు తరలించి అబ్జర్వేషన్లో ఉంచారు. మరోవైపు ఏదైనా మెడికల్ ఎమర్జెన్సీ తలెత్తితే వారిని తరలించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. ఇదిలా ఉంటే.. అంతుచిక్కని అనారోగ్యంతో మరణించినవారికి CSIR-IITR అటాప్సీ (శవ పరీక్ష) నిర్వహించింది. మృతదేహాల్లో న్యూరోటాక్సిన్స్ ఉన్నాయని అటాప్సీ రిపోర్టులో తేలింది. మరోవైపు కేంద్ర హోంశాఖ ఏర్పాటు చేసిన ఇంటర్-మినిస్టీరియల్ టీమ్ కూడా ఈ అంశంపై విచారణ జరుపుతోంది. ఈ బృందంలో హోంశాఖతో పాటు ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ, వ్యవసాయ శాఖ, రసాయనాలు ఎరువుల శాఖ, నీటి వనరుల శాఖకు చెందిన నిపుణులు ఉన్నారు.

### స్మశానంగా మారుతున్న గ్రామం

అంతుచిక్కని వరుస మరణాలతో గ్రామం స్మశానంగా మారుతోంది. జనవరి 12-17 తేదీల మధ్య తన ఐదుగురు పిల్లలు, మేనమామ %-% అత్తలను కోల్పోయిన మహ్మద్ అస్లాం తన వ్యవసాయ భూమిలో సమాధులు నిర్మించారు. ఇప్పుడు మిగిలిన ఏకైక కుమార్తె యస్మీనా జాన్ ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. అంతకంటే ముందు డిసెంబర్ 12న అస్లాం కజిన్ సోదరుడు మహ్మద్ రఫీఖ్ తన గర్భవతి భార్యతో పాటు ముగ్గురు చిన్నారులను కోల్పోయాడు. వరుస మరణాలతో గ్రామస్థుల్లో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. గ్రామస్థులు పెళ్లి భోజనాలు సహా సామూహిక భోజనాలు చేయాలంటే వణికిపోతున్నారు. మరోవైపు ఈ మూడు కుటుంబాలు మినహా మిగతా గ్రామవాసుల్లో మరెవరూ అస్వస్థతకు గురికాకపోవడం ఉపశమనం కల్గించే అంశం.

ఈ న్యూరో టాక్సిన్లు అంటే ఏంటి?

వరుస మరణాలకు స్పష్టమైన కారణం తెలియకున్నా అటాప్సీ నివేదిక మాత్రం మృతదేహాల్లో న్యూరోటాక్సిన్లు ఉన్నాయని చెబుతోంది. న్యూరోటాక్సిన్ అనేది నాడీ కణాలను (న్యూరాన్లు) దెబ్బతీయడం లేదా బలహీనపరచడం ద్వారా నాడీ వ్యవస్థ యొక్క సాధారణ పనితీరును దెబ్బతీసే విష పదార్థం. న్యూరోటాక్సిన్లు మెదడు, వెన్నెముకతో పాటు నరాలను ప్రభావితం చేస్తాయి. ఈ టాక్సిన్ రకాలు, తీవ్రతను బట్టి వివిధ రకాల లక్షణాలతో మనిషి తీవ్ర అనారోగ్యం పాలవుతాడు. ప్రాణాలు కూడా కోల్పోతాడు. ఈ పదార్థాలు బ్యాక్టీరియా, మొక్కలు లేదా జంతువులు వంటి సహజ జీవుల ద్వారా తయారవుతాయి. లేదా సింథటిక్ రసాయనాల ద్వారా కూడా తయారు చేయవచ్చు. గ్రామంలో మరణాలు న్యూరోటాక్సిన్ల వల్ల సంభవించాయని ఆరోగ్య శాఖ నిపుణులు భావిస్తున్నారు. ప్రభుత్వ వైద్య కళాశాల రాజౌరి ప్రిన్సిపాల్ డాక్టర్ AS భాటియా మాట్లాడుతూ మరణించిన వ్యక్తులంతా దాదాపు ఒకే రకమైన లక్షణాలను ప్రదర్శించారని చెప్పారు. వాటిలో మెదడు వాపు లేదా ఎడెమా వంటి లక్షణాలు ఎక్కువగా కనిపించాయని అన్నారు. దేశంలోని అగ్రశ్రేణి ప్రయోగశాలలు విశ్లేషించిన నమూనాలలో న్యూరోటాక్సిన్లు ఉన్న విషయం బయటపడిందని, మెదడు దెబ్బతినడానికి అవే కారణమయ్యాయని డాక్టర్ భాటియా వివరించారు. మెదడుకు జరిగే నష్టాన్ని తాము కొంతమేర మాత్రమే అడ్డుకోగలమని, రోగి మెదడు తీవ్రంగా దెబ్బతిన్నట్టయితే ప్రాణాలు కాపాడ్డం అసాధ్యమని వెల్లడించారు. వైరస్ లేదా బ్యాక్టీరియా కారణంగా ఈ మరణాలు సంభవిస్తున్నాయని, ఇవి ఒకరి నుంచి మరొకరికి వేగంగా వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని తొలుత ఆందోళన చెందినప్పటికీ, మరణాలకు కారణం వైరస్, బ్యాక్టీరియా కారణం కాదని, అంటువ్యాధిలా విస్తరించే ప్రమాదం లేదని NCDC, NIV సంస్థలు తమ ల్యాబ్ టెస్టుల అనంతరం తేల్చాయి. కేవలం న్యూరోటాక్సిన్లే అక్కడి వ్యక్తుల మరణాలకు కారణమవుతున్నాయని తేలింది. అవి ఎలా ఉత్పత్తి అయ్యాయి%ౕ% గ్రామస్తుల శరీరాల్లోకి ఎలా చేరాయి అన్నదే ఇప్పుడు తేలాల్సి ఉంది

# ఈ ఫార్ములా విచారణ.. రూ.41 కోట్లు బాండ్లు ఎందుకిచ్చారు?



సంచలనంగా మారిన ఈ కారు రేసు వ్యవహారంపై ఏసీబీ విచారణ జరుపుతున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే మాజీ మంత్రి కేటీఆర్ విచారణకు హాజరు కావటం.. అధికారులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వటం తెలిసిందే. తాజాగా ఈ వ్యవహారానికి సంబంధించి ఫార్ములా ఈ -కారు రేసుకు ప్రమోటర్ గా వ్యవహరించిన ఏస్ నెక్ట్స్ జెన్ కంపెనీ ప్రతినిధులు ఏసీబీ అధికారుల ఎదుట హాజరయ్యారు. వీరిలో సంస్థ ఎండీ చలమలశెట్టి అనిల్ కుమార్ తదితరులు ఉన్నారు. / ఇంతకూ ఎఫ్ఈఓ, ఏస్ నెక్ట్సజెన్ మధ్యనున్న ఒప్పందం విషయానికి వస్తే.. ప్రమోటర్ గా ఉంటూ 9-12 సెషన్లకు సంబంధించిన ఫీజును ఎఫ్ ఈవోకు వాయిదాల రూపంలో చెల్లించాలి. బ్రిటన్ కు చెందిన ఏఫ్ఈవోతో అప్పటి మంత్రి కేటీఆర్ తొలిదఫా చర్యలు జరిపిన తర్వాత.. హఠాత్తుగా ఏస్ నెక్ట్సజెన్, ఏస్ రేస్ కంపెనీలను 2022 జూలైలో రిజిస్ట్రేషన్ చేయించటంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ కంపెనీల రిజిస్ట్రేషన్ కు పదిహేను రోజులకు ముందే బీఆర్ఎస్ పార్టీకి ఏస్ నెక్ట్సజెన్, ఏస్ రేస్ కంపెనీల మాతృసంస్థ గ్రీన్కో నుంచి రూ.10 కోట్ల ఎలక్టోరల్ బాండ్లు రావటం సందేహాలకు తెర తీసింది. దీనికి 2 నెలల ముందే గ్రీన్కో నుంచి బీఆర్ఎస్ కు రూ.31 కోట్ల భారీ మొత్తం ఎలక్టోరల్ బాండ్ల రూపంలో అందాయి. అయితే.. తొమ్మిదో సెషన్ పూర్తయినతర్వాత పదో సెషన్ ప్రారంభానికి ముందే డీల్ నుంచి ఏస్ నెక్ట్సజెన్ బయటకు వచ్చేసింది. వీటిపై ఏసీబీ ఫోకస్ చేసింది. తాజాగా విచారణకు హాజరైన వారిని అధికారులు పలు ప్రశ్నలు సంధించారు. వారికి ఎదురైన ప్రశ్నల్లో ముఖ్యమైనవి చూస్తే..

- క్రీడల్లో ఏ మాత్రం అనుభవం లేని మీ కంపెనీ ఇందులోకి ఎందుకు దిగింది? - మిమ్మల్ని ఎవరు ఆహ్వానించారు? - మీకు ఎలాంటి హామీలు ఇచ్చారు?

- ఒప్పందానికి ముందే బీఆర్ఎస్ కు ఎలక్టోరల్ బాండ్ల రూపంలోరూ.41 కోట్ల భారీ మొత్తాన్ని ఎందుకు ఇచ్చారు? - రేసు ద్వారా మీ కంపెనీకి లాభం వచ్చిందా? నష్టం వచ్చిందా? - ఒప్పందం అమల్లో ఉన్నప్పటికీ రెండో సెషన్ పూర్తి చేయకుండా ఎందుకు వైదొలిగారు? - మాజీ మంత్రి కేటీఆర్ తో ఉన్న సంబంధం ఏమిటి? - ఫార్ములాఈ కారు రేసులో ప్రమోటర్ గా ఉండనున్న విషయం మీకు ఎప్పుడు తెలిసింది? - మిమ్మల్ని ఈ కారు రేసుకు ప్రమోటర్ గా ఆహ్వానించింది కేటీఆరేనా? - ప్రమోటర్ గా అవకాశం లభిస్తుందన్న విషయం తెలిసే.. రేసు ప్రారంభానికి ముందు ఈ కంపెనీల్ని తెరిచారా? - అప్పట్లో మీకు .. రాష్ట్ర పురపాలక శాఖకు మంత్రిగా వ్యవహరిస్తున్న కేటీఆర్ తో మీకు జరిగిన సంభాషణలేంటి? - కంపెనీకి రావాల్సిన రూ.90 కోట్ల ఫీజును ఏస్ అర్బన్ డెవలపర్స్ నుంచి రుణంలో ఎందుకు తీసుకున్నారు? - ఏస్ అర్బన్ డెవలపర్స్ కంపెనీ ఏస్ నెక్ట్స్ జెన్.. ఏస్ రేస్ కంపెనీల అనుబంధ సంస్థనే కదా? నిజానికి విచారణ ఆలస్యంగా ప్రారంభమైంది. దీనికి కారణం విచారణకు హాజరైన ఏస్ నెక్ట్సజెన్ కంపెనీ ప్రతినిధులు రావాల్సిన విమానం ఆలస్యం కావటంతో.. కాస్త ఆలస్యంగా వచ్చారు. తమ విమానంలేట్ అవుతుందని.. తమకు కాస్త సమయం ఇవ్వాలని కోరగా.. అందుకు అధికారులు ఓకే చెప్పినట్లు తెలుస్తోంది. మూడున్నర గంటల పాటు సాగిన విచారణ పూర్తి కాలేదని.. సమయం సరిపోలేదు కాబట్టి.. మరోసారి విచారణకు పిలుస్తామని చెప్పినట్లుగా తెలుస్తోంది. కేటీఆర్ చుట్టూనే అధిక ప్రశ్నలు ఎదురైనట్లుగా తెలుస్తోంది.

# ప్రపంచంలోనే ఇదే మొట్టమొదటి ప్రాజెక్టు.. ఎక్కడో కాదు మన ఏపీలోనే..



ప్రపంచంలోనే ఇదే మొట్టమొదటి ప్రాజెక్టు.. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ విద్యుత్ కి.. 50 శాతం విద్యుత్ అందించే ప్రాజెక్టు అది. ఇప్పటికే 10 వేల కోట్ల వ్యయం. మరో 14 వేల కోట్లు ఖర్చు పెడుతున్నారు.. ఇంతకు ఆ ప్రాజెక్టును నిర్మిస్తున్న సంస్థ ఏంటి..? ఏమిటా ప్రాజెక్టు? ఎక్కడ ఉంది? పూర్తి వివరాలను తెలుసుకోండి.. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పాణ్యం మండలం పిన్నాపురం పరిధిలో గ్రీన్ కో సంస్థ చేపట్టిన ఇంటిగ్రేటెడ్ రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్ట్ అందరి దృష్టిని ఆకట్టుకుంటోంది.. ఇప్పటికే దీని పనులు 80% పైగా పూర్తయ్యాయి. పలు దేశాల భాగస్వామ్యంతో ఈ భారీ ప్రాజెక్టుకు రూపుదిద్దుకుంటోంది. ఈ ప్రాజెక్టు ఉద్దేశం ఏమిటంటే%ౕ% సౌర, పవన, హైడల్.. విద్యుత్ ఒకే చోట జరుగుతుండటం. మరో విశేషం ఏంటంటే.. విద్యుత్ ఉత్పత్తికి వాడే నీటిని రీసైకిల్ చేయడం. ఎగువ నుంచి నీటిని దిగువకు వదులుతూ విద్యుత్ ఉత్పత్తి చేయడం, అదే నీటిని వెనక్కి రప్పిస్తూ మళ్లీ విద్యుత్ ఉత్పత్తి చేయడం%ౕ% దీని స్పెషాలిటీ. సూర్య రష్మి ఉన్నంతవరకు సౌర విద్యుత్, పవన్ విద్యుత్, రాత్రి వేళల్లో హైడల్ పవర్ ప్రొడక్షన్. ఇలా మూడు రకాల విద్యుత్ ప్రత్తిని ఒకే చోట చేయడం ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం. ఏపీలో వ్యవసాయ రంగానికి ప్రస్తుతం ఉపయోగిస్తున్న విద్యుత్తులో ఏకంగా 50 శాతం విద్యుత్ ఉత్పత్తి ఒకే చోట జరగడం దీని స్పెషాలిటీ అని సాక్షాత్తు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మీడియా ముందర చెప్పడం విశేషం. ఇప్పటికే 10,000 కోట్లకు పైగా ఖర్చు చేశారని, మరో 14 వేల కోట్లు ఖర్చు చేయాల్సి ఉందని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. ఇప్పటికే గ్రీన్ కో ఓర్వకల్, గని తదితర ప్రాంతాలలో భారీ ఎత్తున సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేస్తుంది. ఈ మొత్తం ప్రాజెక్టుని పవన్ కళ్యాణ్ ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలించారు. దాదాపు 1000 ఎకరాలకు పైగా అటవీ భూములు ఇందులో ఉన్నాయని, కేంద్ర ప్రభుత్వ అనుమతితో నెల్లూరు జిల్లాలో అటవీ శాఖకు అంతే స్థాయిలో భూములు ఇవ్వడం జరిగిందని పవన్ కళ్యాణ్ వివరించారు. మరికొంత అటవీ భూములపై రెవెన్యూ అటవీ శాఖ మధ్య వివాదం నడుస్తున్నందున పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదన పంపినట్లు కూడా పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు గనుక పూర్తి అమలులోకి వస్తే విద్యుత్ సమస్య చాలావరకు పరిష్కారం అవడమే కాకుండా%ౕ%. ఇతర ప్రపంచ దేశాలకు కూడా విక్రయించే లా ప్రయత్నం చేస్తామని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. విద్యుత్ ఉత్పత్తితోపాటు.. చూడటానికి చాలా అద్భుతంగా ఉందని ప్రపంచ పర్యాటక కేంద్రంగా కూడా దీనిని చేసే ప్రయత్నంలో పరిశీలిస్తామని ఉప ముఖ్యమంత్రి చెప్పడం చర్చనీయంకంగా మారింది. పవన్ కళ్యాణ్ వచ్చి మీడియంలో చెప్పే వరకు బయట ప్రపంచానికి ఇంత ప్రాజెక్టు ఉందా? అనే విషయం కూడా చాలామందికి తెలియదు. ఇప్పుడైనా ఇంత భారీ ప్రాజెక్టు బయటి ప్రపంచానికి కనిపిస్తుండటం ఆసక్తికరంగా మారింది.

### జగన్ శంకుస్థాపన..

అయితే.. ప్రపంచంలోనే అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ పునరుత్పాదక ఇంధన నిల్వ ప్రాజెక్టుకు కర్నూలులో 2022లో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి శంకుస్థాపన చేశారు. 5230 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసే లక్ష్యంతో గ్రీన్‌కో గ్రూప్ చేపట్టిన ఈ ప్రాజెక్టు చరిత్రలో నిలుస్తుందంటూ పేర్కొన్నారు.

## కేంద్రం భూములిస్తే శానిటేషన్ వర్కర్లకు ఇళ్లు కట్టిస్తాం

### ప్రధానికి కేజ్రీవాల్ లేఖ



న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వం భూమి కేటాయిస్తే, ఢిల్లీ ప్రభుత్వం శానిటేషన్ వర్కర్లకు ఇళ్లు కట్టించి ఇస్తుందని ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ పేర్కొన్నారు. ఈ మేరకు ప్రధాన మంత్రి నరేంద్రమోడీకి అరవింద్ కేజ్రీవాల్ ఆదివారం లేఖ రాశారు. ఢిల్లీలోని పారిశుధ్య కార్మికులు, ఇతర ప్రభుత్వ ఉద్యోగులకు సబ్సిడీపై భూమి కేటాయించాలని ఆ లేఖలో కోరారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'పారిశుధ్య కార్మికులు మురికివాడల్లో నివసిస్తుండటం చూశాను. దీనిపై ప్రధానికి లేఖ రాశాను. ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఒక స్కీమ్ ప్రవేశపెట్టాలని కోరారు. ఆ పథకం కింద సబ్సిడీతో భూములను కేంద్రం కేటాయిస్తే అప్పుడు ఢిల్లీ ప్రభుత్వం వారికి ఇళ్లు కట్టించి ఇస్తుంది' అని తెలిపారు. తొలుత ఎన్‌డిఎంసి, ఎంసిడి పారిశుధ్య కార్మికులకు కేంద్రం భూమి కేటాయిస్తే, వారి వేతనాల నుంచి ఇన్‌స్టాల్‌మెంట్లుగా ఆ మొత్తాన్ని చెల్లిస్తామని చెప్పామని పేర్కొన్నారు. ఇది పేద ప్రజలకు ఉద్దేశించిన పథకం అయినందున ప్రధాని అంగీకరిస్తారని ఆశిస్తున్నట్టు తెలిపారు. ఇది పూర్తయిన తర్వాత మిగతా ప్రభుత్వ ఉద్యోగులకు కూడా ఈ పథకాన్ని అమలు చేయవచ్చునని చెప్పారు.

## ట్యాక్స్ టెర్రరిజానికి అంతం పలకండి

### బడ్జెట్‌కు ముందు కేంద్రానికి కాంగ్రెస్ విజ్ఞప్తి



న్యూఢిల్లీ : ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు అడ్డంకిగా ఉన్న 'రైడ్ రాజ్, ట్యాక్స్ టెర్రరిజానికి' అంతం పలకాలని కేంద్ర ప్రభుత్వానికి కాంగ్రెస్ విజ్ఞప్తి చేసింది. త్వరలో కేంద్రబడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి (కమ్యూనికేషన్స్) జైరాం రమేష్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. దేశీయ తయారీ రంగంలో ఉద్యోగాలను రక్షించడానికి చర్యలు తీసుకోవాలని, వేతనాలు, కొనుగోలు శక్తిని పెంచడానికి నిర్ణయాత్మక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఇలాంటి చర్యలు దేశీయ వ్యాపార రంగంలో పెట్టుబడులను ప్రోత్సహిస్తాయని చెప్పారు. 'జిఎస్‌టి, ఆదాయపు పన్ను రెండింటినీ కవర్ చేసే బైజాంటైన్, శిక్షాత్మక, ఏకపక్ష పన్ను విధానం ట్యాక్స్ టెర్రరిజానికి సమానం. ఇది దేశపు శ్రేయస్సుకు గొప్ప ముప్పు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు అడ్డంకి' అని జైరాం రమేష్ విమర్శించారు. మన్మోహన్‌సింగ్ ప్రభుత్వ హయాంలో జిడిపిలో 30 శాతం వరకూ ఉన్న ప్రైవేట్ దేశీయ పెట్టుబడులు పదేళ్లలో 20 శాతానికి దిగజారిపోయాయని అన్నారు. పెట్టుబడులు క్షీణించడంతో వలసలు భారీగా పెరుగుతున్నాయని, గత దశాబ్ద కాలంలో 17.5 లక్షల మంది భారతీయులు ఇతర దేశాల పౌరసత్వాన్ని స్వీకరించారని తెలిపారు. 2022 నుంచి 2025 మధ్యకాలంలో దాదాపు 21,300 మంది మిలియనీర్లు దేశం విడిచిపోయినట్లు ఒక అంచనా అని జైరాం రమేష్ వెల్లడించారు. ఇలాంటి పరిస్థితికి మూడు ముఖ్య కారణాలు అని రమేష్ తెలిపారు. ఇందులో మొదటిది సంక్లిష్టమైన జిఎస్‌టి అని, ప్రస్తుతం జిఎస్‌టిలో సెస్‌లతోసహా వంద వరకూ వివిధ ట్యాక్స్ రేట్లు ఉన్నాయని చెప్పారు. ఇలాంటి గందరగోళపు రేట్లతో 2023 - 24 ఆర్థిక సంవత్సరంలో రూ.2.01 లక్షల కోట్ల జిఎస్‌టికి దారితీసిందని, ఇది అంతకుముందు ఏడాది కంటే దాదాపు రెట్టింపు అని వెల్లడించారు. 2023-24లో రికార్డు స్థాయికి (85 బిలియన్ డాలర్లకు) వాణిజ్య లోటు చేరడం రెండో కారణమని, స్తబ్దుగా ఉన్న వేతనాలు మూడో కారణమని తెలిపారు. ఇలాంటి తిరోగమన విధానాలు భారత్‌పై పెట్టుబడిదారుల విశ్వాసాన్ని దెబ్బతీశాయని విమర్శించారు.

## బాబా రామ్‌దేవ్‌పై అరెస్ట్ వారెంట్



తిరువనంతపురం : పతంజలి ఆయుర్వేద్ ప్రజలను తప్పుదోవపట్టించే ప్రకటనలు ఇస్తోందని దాఖలైన ఫిర్యాదుపై కేరళలోని పాలక్కడ్ జిల్లా కోర్టు బాబా రామ్‌దేవ్, ఆయన సన్నిహితుడు ఆచార్య బాలకృష్ణలపై బెయిలబుల్ వారంట్లు జారీ చేసింది. కేరళకు చెందిన ఓ వైద్యుడు మూడేళ్ల క్రితమే ఈ అంశంపై కేంద్రానికి ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత కేరళలో పది కేసులు, ఉత్తరాఖండ్‌లో ఒక కేసు నమోదయ్యాయి. కన్నూర్‌కు చెందిన ఆప్తమాలజిస్ట్ కెవి బాబు దాఖలు చేసిన పలు ఫిర్యాదులను పురస్కరించుకొని కేరళ ఔషధ నియంత్రణ విభాగం రాష్ట్రంలోని తన కార్యాలయాలన్నింటికీ ఆదేశాలు జారీ చేసింది. 1954 డ్రగ్స్ అండ్ మ్యాజిక్ రెమిడీస్ (అభ్యంతరకర ప్రకటనలు) చట్టాన్ని ఉల్లంఘించినందుకు పతంజలిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని సూచించింది. కొన్ని పతంజలి ఆయుర్వేద ఉత్పత్తులు బిపి, సుగర్ వ్యాధులను నయం చేస్తాయని, ఇతర ఆరోగ్య సమస్యలను కూడా తీరుస్తాయని వ్యాపార ప్రకటనలు ఇచ్చారు. ఇలాంటి ప్రకటనలు జారీ చేయడాన్ని డిఎంఆర్ చట్టం నిషేధిస్తోంది.

## అమెరికాలో మరోసారి కాల్పులు - తెలంగాణ యువకుడు మృతి



తెలంగాణ : అమెరికాలో మరోసారి జరిగిన కాల్పుల్లో తెలంగాణ యువకుడు మృతి చెందాడు. నెల రోజుల క్రితం తెలంగాణకు చెందిన ఓ విద్యార్థి దుండగుల కాల్పుల్లో మృతి చెందాడు. ఈ వార్త మరవక ముందే మరో హైదరాబాద్ యువకుడు కాల్పుల్లో మరణించాడు. హైదరాబాద్ చైతన్యపురి పరిధిలోని ఆర్కేపురం డివిజన్ గ్రీన్ హిల్స్ కాలనీ రోడ్ నంబర్ 2 లో నివసిస్తున్న కొయ్యడ చంద్రమౌళి కుమారుడు రవి తేజ 2022లో మార్చిలో అమెరికాకు వెళ్లాడు. అక్కడ అతను మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేసి ఉద్యోగ అన్వేషణలో ఉన్నాడు. అమెరికాలోని వాషింగ్టన్‌లో జరిగిన దుండగుల కాల్పుల్లో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటనతో హైదరాబాద్‌లోని అతని ఇంటి వద్ద విషాద ఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులంతా కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

# మధ్యతరగతిపైనే పన్నుల భారం




ఫిబ్రవరి 1న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 202526 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బడ్జెట్‌ను ప్రవేశపెట్టడానికి సిద్ధమవుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వం గత రెండుసార్లు ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మధ్యతరగతికి ప్రయోజనం కలిగించేవి ఏవీ లేవు. కేవలం స్థూల ఆర్థిక వర్గాలకే ఆ బడ్జెట్ ప్రయోజనం కల్పించింది. మధ్యతరగతి అంటే ప్రధానంగా వేతన జీవులు, పెన్షనర్లతో కూడుకున్నది. వీరంతా రానున్న బడ్జెట్‌లో తమకు ప్రత్యేక ప్రయోజనాలు కల్పిస్తారన్న ఆశతో ఎదురుచూస్తున్నారు. వినియోగం, డిమాండ్, బ్యాంకుల్లో సేవింగ్స్, చిన్నపొదుపు పథకాలు, క్యాపిటల్ మార్కెట్, ఆదాయం పన్ను కచ్చితంగా చెల్లించడం తదితర విధానాలు ద్వారా మధ్యతరగతి దేశ ఆర్థికానికి సహకరిస్తున్నారన్నది గమనించదగిన వాస్తవం. అందువల్ల కేంద్ర ఆర్థిక మంత్రి నుంచి కొన్ని ప్రయోజనాలను ఆశించడానికి వీరు అర్హులవుతారు. ముఖ్యంగా ఆర్థిక అంశాల్లో వీరికి ప్రయోజనాలు కల్పిస్తే ఎప్పటిలాగే ఆర్థికంగా తోడ్పడగలుగుతారని ఆర్థిక విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే మధ్యతరగతి పైనే పన్నుల భారం అధికంగా పడుతుండటం జీర్ణించుకోలేని సమస్య. దీనికి కారణం వీరి వినియోగం డిమాండ్. వీరు కొనుగోలు చేసిన వస్తువులపై విధించే జిఎస్‌టి వీరి కొనుగోలు శక్తిని తగ్గించేస్తోంది. అధిక ఖర్చులతో మధ్యతరగతి ప్రజలు అల్లాడిపోతున్నారు. అందువల్ల రానున్న 2025 బడ్జెట్‌లో పన్ను మినహాయింపులు ప్రభుత్వం కల్పిస్తుందన్న ఆశతో ఎదురు చూస్తున్నారు. వ్యవస్థీకృత రంగంలోనూ ఆదాయాలు వేర్వేరుగా ఉండడంతో దేశంలోని 10.4 కోట్ల పన్ను చెల్లింపుదారులకు స్థిరమైన ఆదాయం అవసరం చాలా ఉందని ఇటీవల చీఫ్ ఎకనామిక్ అడ్వైజర్ అధ్యయనంలో తేలింది. ఇటీవల కొన్నిసంవత్సరాలుగా మధ్యతరగతి వర్గాలు కార్పొరేట్ల కన్నా చాలావరకు పన్ను భారాన్ని మోస్తున్నారు. 2023 నుంచి కార్పొరేట్ల నుంచి వచ్చే పన్ను వసూలు కన్నా వ్యక్తిగత ఆదాయ పన్ను వసూలు అత్యధికంగా ఉంటోంది. 2024లో కార్పొరేట్ల పన్ను వసూలు కన్నా వ్యక్తిగత ఆదాయ పన్ను వసూళ్లు 15% అధికంగా కనిపించింది. దీనివల్ల ప్రత్యక్ష పన్ను వసూలు ఆదాయంలో 54% అంటే మొత్తం రూ.19.6 లక్షల కోట్లలో 10.45 లక్షల కోట్ల వరకు వ్యక్తిగత పన్ను ఆదాయ వసూలే చోటుచేసుకుంది. 2024లో వ్యక్తిగత ఆదాయ పన్ను వసూలు 25% వరకు పెరగ్గా, కార్పొరేట్ ఆదాయ వసూలు 10.4 శాతం వరకే పెరుగుదల చూపించింది. అంటే ఆ మేరకు రూ. 9.1 లక్ష కోట్లు వరకు పెరుగుదల కనిపిస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరంలో మొదటి ఆరు నెలల్లో ఈ తేడా మరీ ఎక్కువైంది. కార్పొరేట్ పన్ను వసూలు 2.3 శాతం, వ్యక్తిగత ఆదాయ పన్ను వసూలు 25% వృద్ధి కనిపించడం గమనార్హం. సెంట్రల్ బోర్డు ఆఫ్ డైరెక్ట్ టాక్సెస్ ఇటీవల విడుదల చేసిన డేటా ప్రకారం ఎవరైతే వార్షికాదాయం రూ. 5.5 లక్షల నుంచి రూ. 9.5 లక్షల కేటగిరిలో పొందగలుగుతున్నారో వారిపై పన్నుభారం అత్యధికంగా ఉంటోంది. ఆ కేటగిరి దాటి ఆదాయం ఉన్న వారికి పన్నుభారం తక్కువగా ఉంటోంది. ఈ నేపథ్యంలో మధ్యతరగతికి పన్నుభారం నుంచి వెసులుబాటు కల్పించాల్సిన అవసరం ఏర్పడుతోందని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. అప్రకటిత ఆదాయం ఉన్న వారికి రూ. కోటి వరకు పన్ను చెల్లింపు వెసులుబాటు కల్పించడం, వారి నుంచే పన్ను చెల్లింపు తక్కువగా ఉండటం విమర్శలకు దారి తీస్తోంది. దీనివల్ల తక్కువ స్థాయి ఆదాయ వర్గాల నుంచే 2015 2024 మధ్యకాలంలో పన్ను చెల్లింపుదారుల సంఖ్య రెట్టింపు అయిందని తెలుస్తోంది. ప్రస్తుతం రూ. 3 లక్షల వరకు ఉన్న ఆదాయ స్లాబ్‌ను రూ. 5 లక్షల వరకు జీరో రేటు ఇన్‌కమ్ స్లాబ్‌గా సవరించాలని అంటున్నారు.ఈ పరిస్థితుల్లో మధ్యతరగతి పన్ను చెల్లింపుదారులపై భారాన్ని తగ్గించడానికి తగిన సంస్కరణలు అవసరమన్న ప్రతిపాదనలు తెరపైకి వస్తున్నాయి. ఆర్థిక వ్యవస్థ నిర్వహణపై బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ విధానాలు మధ్యతరగతి పన్ను చెల్లింపుదారుల్లో తీవ్ర అసంతృప్తికి ఆజ్యం పోస్తున్నాయి. గత నెల (డిసెంబర్ 2024)లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన 55వ జిఎస్‌టి కౌన్సిల్ సమావేశం జరిగింది. వివిధ రకాల పాప్‌కార్న్‌లపై వేర్వేరు జిఎస్‌టి రేట్లను విధించడం హాస్యాస్పదం అనిపించడమే కాక వినియోగదారుల్లో ఆగ్రహం కూడా వ్యక్తమైంది. అలాగే వాహనాల రీసేల్‌పై పన్నులు విధిస్తూ తీసుకున్న నిర్ణయాలపై దుమారం చెలరేగింది. ఇది ఈ ప్రభుత్వ'పన్ను తీవ్రవాదం' అని, ఈ పన్నుల వ్యవస్థ దోపిడీయే తప్ప మరింకేమీ కాదని వ్యాఖ్యానిస్తున్నారు. దీనికి పెద్ద ఉదాహరణ ఆరోగ్యబీమాపై పూర్తిగా 18% జిఎస్‌టి విధించడం. 2024 ఆర్థిక సంవత్సరంలో ఆరోగ్య, జీవిత బీమా నుంచి కేంద్ర ప్రభుత్వం జిఎస్‌టి ద్వారా రూ. 16,398 వసూలు చేయగలిగింది. ఇంతచేసినా భారత దేశంలో 2024 సెప్టెంబర్ త్రైమాసికంలో 5.4 శాతానికి జిఎస్‌టి పడిపోయింది. ద్రవ్యోల్బణం మధ్యతరగతి ఆదాయాలను దెబ్బతీస్తోంది. రోజువారీ ఖర్చులను బాగా పెంచేసింది. 2024 అక్టోబర్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం 14 నెలల గరిష్ఠ స్థాయి 6.2 శాతానికి చేరుకుంది. ఆహార ధరలు 10.9% పెరిగాయి. ముఖ్యంగా పెరుగుతున్న ఆరోగ్య భద్రత, విద్య ఖర్చులు భరించ్గాలంటే పన్నుల వ్యవస్థలో ప్రామాణిక తగ్గింపు పెంచాలని ఉద్యోగులు, పెన్షన్‌దారులు కోరుతున్నారు. మధ్య తరగతి వర్గాలకు పన్ను ఎంత సడలిస్తే అంత ఆర్థికంగా పెద్ద ఆసరా కలుగుతుంది. పన్నుల వ్యవస్థను క్రమబద్ధీకరించడం ద్వారా లక్షలాది కుటుంబాలకు ఆర్థిక సౌలభ్యం లభిస్తుందని ఆశిస్తున్నారు.

# ఇకనైనా స్వేచ్ఛావాయువులు వీచాలి!



ఇజ్రాయెల్- హమాస్ మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందానికి ఇజ్రాయెల్ సెక్యూరిటీ కేబినెట్ ఆమోదముద్ర వేయడంతో ఈ ఒప్పందం సాకారం కానున్నదనే నమ్మకం అందరిలోనూ కలుగుతోంది. వారం రోజుల క్రితం ఒప్పందం కుదిరిందనే వార్తలు వెలువడినా, కాలికి వేస్తే వేలికి, వేలికి వేస్తే కాలికి అన్న చందంలో మడత పేచీలు పెట్టడంలో సిద్ధహస్తుడిగా పేరుగాంచిన ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ మరిన్ని రాయితీలు పొందేందుకు వీలుగా ఒప్పందంలోని అంశాలనుంచి హమాస్ వెనక్కు తగ్గుతోందని, అందువల్ల ఒప్పందం ఇంకా పూర్తిస్థాయిలో కుదరలేదని ప్రకటించడంతో ఈ ఒప్పందం అమలుపై నీలినీడలు అలముకున్నాయి. తాజాగా ఇజ్రాయెల్ సెక్యూరిటీ కేబినెట్ ఆమోదముద్ర వేయడంతో కాల్పుల విరమణకు ముందడుగు పడింది. ఇక పూర్తిస్థాయి మంత్రివర్గం, ఆ తర్వాత ఇజ్రాయెల్ సుప్రీం కోర్టు సరేనంటే ఒప్పందం గట్టెక్కినట్టే! మూడు దశలలో అమలు కానున్న కాల్పుల విరమణ ఒప్పందం తొలి దశలో భాగంగా హమాస్ తమ చెరలో ఉన్న 33 మంది బందీలను విడుదల చేస్తే, ఇజ్రాయెల్ తమ జైళ్లలో బంధించిన పాలస్తీనియన్లలో కొందరిని వదిలిపెడుతుంది. రెండో దశలో గాజానుంచి ఇజ్రాయెల్ దళాలు వైదొలగుతాయి. ఆపై మూడో దశలో భాగంగా ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో గాజా పునర్నిర్మాణ కార్యక్రమం మొదలవుతుంది. రెండో దశలో చేపట్టవలసిన కార్యాచరణపై రెండు వారాల్లో మరో దఫా చర్చలు మొదలవుతాయి. తాజాగా కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందంలోని అంశాలేవీ కొత్తవి కావు. ఇవే అంశాలపై గత కొన్ని నెలలుగా ఇజ్రాయెల్‌ను దారికి తెచ్చేందుకు ఖతార్, ఈజిప్టు, అమెరికా దేశాలు అనేక విఫల ప్రయత్నాలు చేశాయి. మరి, ఇప్పుడే ఇజ్రాయెల్ ఎందుకు సరేనన్నట్లు? అమెరికా అధ్యక్ష పీఠాన్ని రేపు అధిరోహించబోతున్న డొనాల్డ్ ట్రంప్ తాను పదవీ ప్రమాణం చేయడానికి ముందే యుద్ధం పరిసమాప్తి కావాలని, లేకపోతే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవలసి వస్తుందని అటు మిత్రదేశమైన ఇజ్రాయెల్‌ను, ఇటు ఉగ్రవాద సంస్థ హమాస్ ను హెచ్చరించిన నేపథ్యంలో నెతన్యాహూ దిగివచ్చినట్లు తెలుస్తోంది. సంకీర్ణ ప్రభుత్వాధినేతగా ఆటుపోట్లను ఎదుర్కొంటున్న నెతన్యాహూకు ట్రంప్ అధికారంలోకి వస్తే పదవీగండం తప్పదని గ్రహించి ఉండవచ్చు. ఈ ముందుచూపే నెతన్యాహూను కాల్పుల విరమణవైపు మొగ్గేలా చేసిందనేది రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం. గాజాలో చేయవలసిన విధ్వంసమంతా చేసేశాక, 46 వేల మందికి పైగా అమాయకుల ప్రాణాలు హరించాక ఇప్పుడు ఇజ్రాయెల్ కాల్పుల విరమణకు దిగిరావడంవల్ల గాజావాసులకు ఏం ఒరిగినట్లు? అని ప్రశ్నించుకుంటే ఏడాదిన్నరగా బాంబుదాడుల మధ్య బితుకుబితుకుమంటూ గడిపిన ప్రజలు కనీసం బయటకు వచ్చి శిథిలమైన తమ నివాసాలను చూసుకోవచ్చు. ప్రాణాలు కోల్పోయిన తమవారికోసం స్వేచ్ఛగా ఓ కన్నీటిబొట్టు విడవవచ్చు. అంతకుమించి, ఆకలిదప్పులతో అలమటించిపోతున్న తమ పిల్లలకు కాస్త తిండిపెట్టి కడుపు నింపవచ్చు. తాజాగా అమలు కానున్న కాల్పుల విరమణ ఒప్పందం వల్ల గాజాకు ప్రతి రోజూ ఇకపై 600 ట్రక్కుల ఆహార పదార్థాలు, ఇతరత్రా సాయం అందుతాయి. ఈ యుద్ధం కారణంగా 20 లక్షల మంది గాజావాసులు స్వస్థలాలను వదిలి సురక్షిత ప్రాంతాలకు తరలిపోయారు. ఇప్పుడు వారంతా మళ్లీ స్వస్థలాలకు చేరుకునే అవకాశం ఏర్పడుతుంది. ఇజ్రాయెల్ పై 2023 అక్టోబర్ 7న హమాస్ ఉగ్రవాదులు దాడి జరిపి 1200 మంది ఇజ్రాయెలీలను బలిగొన్నారు. 250 మందిని బందీలుగా చేసుకున్నారు. దీంతో భగ్గుమన్న ఇజ్రాయెల్ సాగించిన ముప్పేట దాడి.. గాజావాసులకు తీరని దుఃఖాన్ని, జీవితాంతం వెంటాడే చేదు జ్ఞాపకాలనూ మిగిల్చింది. ఇప్పుడు వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. అయినవాళ్లనూ, ఇల్లూవాకిళ్లనూ కోల్పోయి నడివీధిలో నిలబడిన గాజా ప్రజలను ఆదుకునేందుకు ప్రపంచదేశాలు ముందుకు రావలసిన సమయమిది. ఐక్యరాజ్యసమితితో చేతులు కలిపి, గాజా పునర్నిర్మాణానికి నడుం బిగించాలి. ఈ క్రమంలో గాజా పునర్నిర్మాణానికి 123 మిలియన్ డాలర్ల సహాయాన్ని ప్రకటించిన ఐరోపా సమాఖ్యను అభినందించాలి. ఇదే విధంగా అన్ని దేశాలూ మానవతాసాయాన్ని ప్రకటించి, గాజాను ఒడ్డున పడేసేందుకు తమ వంతు కృషి చేయాలి. మరో రెండు వారాల్లో శాశ్వత కాల్పుల విరమణ కోసం మొదలు కానున్న చర్చలు సఫలీకృతం కావాలన్నది శాంతికాముకుల, మానవతావాదుల ఆశ, ఆకాంక్ష. అది నెరవేరాలని ఆశిద్దాం.

## ఏడాదిలోనే అత్యధిక స్థాయికి

### బ్లూమ్‌బెర్గ్ వెల్లడి

# పెరిగిన రష్యా చమురు ఉత్పత్తులు




మాస్కో : గత వారం అమెరికా.. రష్యా ఇంధన రంగంపై కొత్త ఆంక్షలు విధించినప్పటికీ శుద్ధి చేసిన రష్యా ఇంధన ఎగుమతులు దాదాపు ఒక సంవత్సరంలో అత్యధిక స్థాయికి చేరుకున్నాయని బ్లూమ్‌బెర్గ్ వార్తా సంస్థ వివరించింది. జనవరి మొదటి పది రోజుల్లో రష్యా పెట్రోలియం ఉత్పత్తుల సముద్ర రవాణా 11 నెలల గరిష్ట స్థాయికి చేరుకుందనీ, అది సగటున రోజుకు 2.5 మిలియన్ బ్యారెళు (బీపీడీ) అని విశ్లేషణ సంస్థ వోర్టెక్సా డేటాను ఉటంకిస్తూ బ్లూమ్‌బెర్గ్ పేర్కొన్నది. డిసెంబర్ రోజువారీ సగటుతో పోలిస్తే ఈ పెరుగుదల 12 శాతంగా ఉందనీ, గతేడాది ఫిబ్రవరి తర్వాత ఇది అత్యధిక స్థాయిని సూచిస్తుందని సదరు వార్తా సంస్థ వివరించింది.బ్రిటన్‌తో సమన్వయం చేసుకుని అమెరికా గత వారం రష్యాపై సరికొత్త ఆంక్షలు విధించింది. ఈ ఆంక్షలు రష్యాలోని ప్రధాన చమురు కంపెనీలైన గాజ్‌ప్రోమ్ నెఫ్ట్, సుర్గుట్నెఫ్టెగాస్‌లను, అలాగే పాశ్చాత్య ఆంక్షలను ధిక్కరించి రష్యన్ చమురును రవాణా చేయడానికి ఉపయోగించిన డజన్ల కొద్దీ నౌకలను (వీటిని అమెరికా 'షాడో ఫ్లీట్'గా అభివర్ణించింది) లక్ష్యంగా చేసుకున్నాయి. ఈ ఆంక్షలను రష్యా ఖండించింది. వాటిని 'చట్టవిరుద్ధం' అని పేర్కొన్నది. క్రెమ్లిన్ ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ ఇవి ప్రపంచ ఇంధన మార్కెట్లను అస్థిరపరచవచ్చని హెచ్చరించారు. తాజా రౌండ్ ఆంక్షలు రష్యన్ వాణిజ్యంలో పాల్గొన్నట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న 180 కంటే ఎక్కువ ట్యాంకర్లను లక్ష్యంగా చేసుకున్నాయి. ప్రధానంగా ముడి చమురు రవాణాపై దృష్టి సారించాయి. అయితే, జనవరి 1 నుంచి 10 మధ్య ఎగుమతి చేయబడిన పెట్రోలియం ఉత్పత్తులలో కేవలం నాలుగు శాతం మాత్రమే ఆంక్షలు విధించబడిన ట్యాంకర్ల ద్వారా రవాణా చేయబడ్డాయని వోర్టెక్సా డేటాలో రికార్డ్ అయింది. ఇంతకు మించి ఈ నౌకల ప్రయాణాలలో ఎటువంటి విచలనం జరగలేదని బ్లూమ్‌బెర్గ్ వివరించింది. రష్యా పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతుల్లో ఇటీవలి పెరుగుదల ప్రధానంగా డీజిల్, ఇంధన చమురు ఎగుమతుల పెరుగుదల కారణంగా ఏర్పడిందని బ్లూమ్‌బెర్గ్ పేర్కొన్నది. డిసెంబర్‌లో ఇంధన ఎగుమతుల నుంచి వచ్చే ఆదాయాలు ముడి చమురు ఆదాయాల క్షీణతను మించిపోయాయనీ, దీనికి పెరుగుతున్న గ్యాసోలిన్ ప్రవాహాలు, మార్కెట్‌లో వాటి ధరల పెరుగుదల కారణమని అంతర్జాతీయ ఇంధన సంస్థ (ఐఇఏ)ను ఉటంకిస్తూ బ్లూమ్‌బెర్గ్ చెప్పింది. రష్యా శుద్ధి చేసిన ఇంధన ఎగుమతుల్లో దాదాపు 40 శాతం ఉన్న డీజిల్, గ్యాసోలిన్ ఎగుమతులు డిసెంబర్ స్థాయిల నుంచి 17 శాతం పెరిగి 1.08 మిలియన్ బీపీడీలకు చేరుకున్నాయి. ఇది గత ఫిబ్రవరి తర్వాత అత్యధికం. బాల్టిక్ ఓడరేవుల నుంచి వచ్చే ఎగుమతులు 50 శాతానికి పైగా పెరిగాయి. ఇది వృద్ధికి దోహదపడిందని డేటా చూపించింది. ఇంధన చమురు ప్రవాహాలు కూడా పెరిగాయి. అవి 792,000 బీపీడీలకు చేరుకున్నాయి. ఇది 19 శాతం పెరిగి, జులై, 2023 తర్వాత అత్యధిక స్థాయికి చేరుకున్నది. ఆఫ్రికాకు ఎగుమతి అయిన రష్యా చమురు ఉత్పత్తులు అత్యంత గణనీయమైన పెరుగుదలను చూశాయి.

